teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 203 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 22 జనవరి 2026 | పేజీలు : 08 | వెల ‘5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## హైదరాబాద్‌లో మినీ దావోస్



- రేవంత్ రెడ్డి ప్రతిపాదనకు గ్లోబల్ లీడర్ల జైత్రయాత్ర
- ఆరు నెలలకోసారి పెట్టుబడుల సమీక్ష




## తెలంగాణ వైద్య విద్యలో

# డిజిటల్ విప్లవం



### 35 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అత్యాధునిక బోధన



### మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశం

**ఉస్మానియా నుండి ఆసిఫాబాద్ వరకు ఒకే స్థాయి ప్రమాణాలు**

రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో వైద్య విద్య బోధనను మెరుగుపరిచే దిశగా వైద్యారోగ్య శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 35 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సంప్రదాయ విద్యా విధానంతో పాటు, అత్యాధునిక సాంకేతికతతో కూడిన డిజిటల్ ఎడ్యుకేషన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి పాల్గొన్నారు.

### హన్మకొండ అడిషనల్ కలెక్టర్

# అక్రమాస్తుల గుట్టురట్టు



- 8 చోట్ల ఏసీబీ దాడులు
- రూ.7.69 కోట్ల ఆస్తుల గుర్తింపు
- భారీగా ఓపెన్ ప్లాట్లు, 14 ఎకరాల వ్యవసాయ భూమి
- విలాసవంతమైన కార్ల స్వాధీనం
- విచారణలో వెలుగు చూసిన బాగోతం



హైదరాబాద్, జనవరి 21 (తీన్మార్ న్యూస్): హన్మకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి (ఇన్‌చార్జ్) అక్రమడ వెంకట్ రెడ్డి అక్రమాస్తుల బాగోతం బట్టబయలైంది. ఇప్పటికే లంచం తీసుకుంటూ పట్టుబడి సస్పెన్షన్‌లో ఉన్న ఆయనపై ఏసీబీ ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసి,

మిగతా 2 లో

### గణతంత్ర వేడుకలపై

# ఉగ్ర నీడ

**భారత్‌పై దాడులకు జైషే మహ్మద్ 26-26 కుట్ర**

**దేశవ్యాప్తంగా నిఘా వర్గాల హై అలర్ట్**



న్యూ ఢిల్లీ, జనవరి 21 (తీన్మార్ న్యూస్): దేశ వ్యాప్తంగా ప్రజలంతా రిపబ్లిక్ డే వేడుకలకు సన్నద్ధం అవుతుంటే మరోవైపు ఉగ్ర మూకలు మరోసారి భారత్‌పై భీకర దాడులకు ప్లాన్ చేస్తున్నట్లుగా భారత నిఘా సంస్థలు అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు సమాచారం ఇచ్చాయి. దాయాది పాక్ కేంద్రంగా పనిచేసే జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ, ఈ ఏడాది

మిగతా 2 లో

सत्यमेव जयते
Goverment Of India

## తెలంగాణ అధికారులకు ఐఏఎస్ హోదా

16 మందికి పదోన్నతులు కల్పిస్తూ గెజిట్ నోటిఫికేషన్

ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం

.. వివరాలు 2లో

## మున్సిపల్ ఎన్నికల వేళ భారీ బదిలీలు

రాష్ట్రవ్యాప్తంగా 47 మంది కమిషనర్ల స్థానచలనం

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

.. వివరాలు 2లో



## కొత్త పార్టీ దిశగా కవిత వేగంగా అడుగులు

మున్సిపల్ ఎన్నికల్లో జాగృతి మద్దతు

బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలపై సంచలన వ్యాఖ్యలు

.. వివరాలు 2లో



### బనకచర్ల ప్రాజెక్టుపై

## సుప్రీంకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం

- న్యాయ పోరాటానికి కసరత్తు
- సమ్మక్కసాగర్ ప్రాజెక్టు ఎన్వోసీ లక్ష్యంగా అడుగులు

తెలంగాణ బ్యూరో, జనవరి 21 (తీన్మార్ న్యూస్): బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టులో సూట్ వేసేందుకు కసరత్తులు ప్రారంభించింది. ఇరిగేషన్

మిగతా 2 లో

### హైదరాబాద్‌కు లోరియల్ బ్యూటీ-టెక్

# గ్లోబల్ సెంటర్

### దావోస్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కీలక ఒప్పందం

తెలంగాణ బ్యూరో, జనవరి 21 (తీన్మార్ న్యూస్): ప్రపంచంలోనే తొలి బ్యూటీ-టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్‌ను హైదరాబాద్లో ఏర్పాటు చేస్తున్నట్లు లోరియల్ సంస్థ ప్రకటించింది. ఈ అత్యాధునిక కేంద్రాన్ని ఈ ఏడాది నవంబర్లో ప్రారంభించనుంది. దావోస్‌లో

మిగతా 2 లో






### ఎర్రవల్లిలో కేసీఆర్‌తో

# హరీశ్‌రావు కీలక భేటీ

- సిట్ విచారణ అనంతరం రాజకీయ ప్రకంపనలు
- కేసీఆర్‌కు నోటీసులు వచ్చే అవకాశం ఉందంటూ ప్రచారం

హైదరాబాద్, జనవరి 21 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో ఆ పార్టీ ఎమ్మెల్యే హరీశ్ రావు భేటీ అయ్యారు. బుధవారం ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్‌కు వెళ్లిన హరీశ్ రావు అక్కడ గులాబీ బాస్‌తో సమావేశం అయ్యారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో

మిగతా 2 లో

### అసంఘటిత రంగ కార్మికులకు

# కేంద్రం తీపి కబురు

- అటల్ పెన్షన్ యోజన మరో ఐదేళ్ల పాటు పొడిగింపు
- నెలకు రూ. 5,000 వరకు పెన్షన్

న్యూ ఢిల్లీ, జనవరి 21 (తీన్మార్ న్యూస్): అసంఘటిత రంగ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. వీరికి నెల నెల పెన్షన్ అందించేందుకు తీసుకు వచ్చిన అటల్ పెన్షన్ యోజన పథకాన్ని

మిగతా 2 లో



# తెలంగాణ వైద్య విద్యలో 'డిజిటల్' విప్లవం

హైదరాబాద్, జనవరి 21 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో వైద్య విద్య బోధనను మెరుగుపరిచే దిశగా వైద్యారోగ్య శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 35 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సంప్రదాయ విద్యా విధానంతో పాటు, అత్యాధునిక సాంకేతికతతో కూడిన డిజిటల్ ఎడ్యుకేషన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. వైద్య విద్యలో సాంకేతికతను జోడించడం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే తేడా లేకుండా విద్యార్థులందరికీ సమానమైన, నాణ్యమైన విద్యను అందించవచ్చని ఆయన స్పష్టం చేశారు.




### మెడికల్ ఎడ్యుకేషన్ బలోపేతంపై దిశానిర్దేశం

ఈ సందర్భంగా మెడికల్ ఎడ్యుకేషన్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఏటా 4,140 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ విద్యను అభ్యసిస్తున్నారు. రాష్ట్రంలో కాలేజీల సంఖ్య భారీగా పెరిగిన నేపథ్యంలో విద్యా ప్రమాణాలపై ఎటువంటి రాజీలేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో చదివిన వైద్యులకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న గుర్తింపును దృష్టిలో ఉంచుకుని, అదే స్థాయి బోధనను కొత్తగా ఏర్పాటైన జిల్లాల కాలేజీల్లోనూ అందించాలి. ఉస్మానియా విద్యార్థికైనా, ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీ విద్యార్థికైనా ఒకే రకమైన అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్య అందాలన్నారు.

### ప్రాక్టికల్ నాలెడ్జ్‌కు ప్రాధాన్యత

మెడికోలకు కేవలం పుస్తక విజ్ఞానానికే పరిమితం చేయకుండా, ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంపొందించాలని మంత్రి సూచించారు. ఇందుకోసం ప్రతి మెడికల్ కాలేజీలో ప్రాథమిక స్థాయి నుంచే డిజిటల్ మౌళిక వసతులను కల్పించాలన్నారు. తరగతి గదుల్లో స్మార్ట్ బోర్డులు, ఎలడీ స్క్రీన్లు, లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని విద్యార్థుల నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పరీక్షించేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించుకోవాలన్నారు. క్లిష్టమైన అనాటమీ, సర్జికల్ ప్రొసీజర్ల పట్ల విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కల్పించేందుకు వర్చువల్ ల్యాబ్స్, సిమ్యులేషన్ టూల్స్, వర్చువల్ రియాలిటీ వంటి అధునాతన పద్ధతులను వినియోగించాలన్నారు. రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక ఉస్మానియా, గాంధీ, వరంగల్ ఎంజీఎం కళాశాలలను సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దాలని ఈ కేంద్రాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆగ్మెంటెడ్ రియాలిటీ వంటి భవిష్యత్ సాంకేతికతపై ప్రత్యేక దృష్టి సారించి, వీటిని ఇతర కళాశాలలకు మెంటార్/శిక్షణా కేంద్రాలుగా మార్చాలన్నారు.

### డిజిటల్ లైబ్రరీలు

నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పాఠ్యాంశాలను డిజిటల్ రూపంలోకి మార్చి, నేషనల్ డిజిటల్ లైబ్రరీతో అనుసంధానం చేయాలని మంత్రి దిశా నిర్దేశం చేశారు. బోధనాసుపత్రుల్లోని రద్దీ దృష్ట్యా, విద్యార్థులకు క్లినికల్ కేస్ స్టడీలను వివరించేందుకు టెలీమెడిసిన్ విధానాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతి కళాశాలలో అవసరమైన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌తో పాటు ఐటీ అడ్మినిస్ట్రేటర్లు, టెక్నీషియన్లను నియమించాలన్నారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం పకడ్బందీగా అమలు జరగాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు, పనితీరును ఏఐ టూల్స్ ద్వారా నిరంతరం విశ్లేషించాలని మన వైద్య విద్యార్థులు ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా రాణించేలా వారిని తీర్చిదిద్దడమే ఈ డిజిటల్ విధానం ప్రధాన ఉద్దేశమని మంత్రి పునరుద్ఘాటించారు.

## హన్మకొండ అడిషనల్ కలెక్టర్ అక్రమాస్తుల గుట్టురట్టు



మొదటి పేజీ తరువాయి

బుధవారం సరూర్‌నగర్‌లోని ఆయన నివాసంతో మొత్తం 8 చోట్ల ఏకకాలంలో దాడులు నిర్వహించింది. ఈ ప్రాథమిక సోదాల్లో సుమారు రూ.7,69,38,332 విలువైన స్థిర, చరాస్తులను అధికారులు గుర్తించారు. అందులో హైదరాబాద్ ఇతర ప్రాంతాల్లో రెండు నివాస గృహాలు ఉన్నాయి. వాటి విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.4.65 కోట్లని తెలుస్తోంది. ఒక కమర్షియల్ షాపు రూ.60 లక్షలు, అదేవిధంగా రూ.65 లక్షలు విలువ చేసే ఎనిమిది ఓపెన్ ప్లాట్లు, రూ.50 లక్షలు విలువ చేసే 14.25 ఎకరాల వ్యవసాయ భూమి, నగదు రూ.30 లక్షలు, బ్యాంక్ సేవింగ్స్ మరో రూ.44 లక్షలు, మూడు విలాసవంతమైన కార్లు వాటి విలువ రూ.40 లక్షలు, 297 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.11 లక్షలు విలువ చేసే గృహోపకణాలను ఏసీబీ అధికారులు గుర్తించారు. కాగా, గతంలో ఒక ప్రైవేట్ పాఠశాల అనుమతి కోసం లంచం తీసుకుంటూ వెంకట్ రెడ్డి ఏసీబీకి పట్టుబడ్డారు. ఆ కేసు విచారణలో భాగంగా ఆయన అక్రమ సంపాదనపై దృష్టి సారించిన అధికారులు, ఈ భారీ అక్రమాస్తులను గుర్తించారు. ఈ మేరకు ఆయనపై 1988 అవినీతి నిరోధక చట్టం ప్రకారం ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు.

## గణతంత్ర వేడుకలపై ఉగ్ర నీడ

మొదటి పేజీ తరువాయి

జనవరి 26న ఢిల్లీ వ్యాప్తంగా భీకర దాడులు చేసేందుకు '26-26' అనే కోడ్ నేమ్‌తో స్కెచ్ వేసినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు గుర్తించాయి. ఈ కుట్రలో భాగంగా గణతంత్ర వేడుకలు జరిగే కర్తవ్య పథ్, ఎర్రకోట వంటి చారిత్రక కట్టడాలతో పాటు, రద్దీగా ఉండే మార్కెట్లు, మెట్రో స్టేషన్లను లక్ష్యంగా చేసుకున్నట్లు సమాచారం. అదేవిధంగా విదేశాల్లో ఉంటున్న ఖలిస్థానీ ఉగ్రవాదులు, స్థానిక గ్యాంగ్‌స్టర్ల నెట్‌వర్క్‌ను వాడుకుని హైబ్రిడ్ తరహాలో ఉగ్రవాదులు దాడులకు ప్లాన్ చేస్తున్నట్లుగా తేలింది.

### రంగంలోకి దిగిన ఢిల్లీ పోలీసులు

నిఘా వర్గాల హెచ్చరికలతో ఢిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆపరేషన్ గ్యాంగ్-బస్ట్ 2026 పేరుతో స్పెషల్ ఆపరేషన్ ప్రారంభించి ఇప్పటి వరకు అల్-ఖైదా, జైషే మహ్మద్ సంస్థలకు చెందిన పలువురు అనుమానిత ఉగ్రవాదుల ఫోటోలతో ఢిల్లీ అంతటా పోస్టర్లు అంటించారు. అనుమానాస్పదంగా కనిపిస్తున్న సుమారు 850 మందిని ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. గణతంత్ర వేడుకల భద్రత కోసం ఏఐ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలు, వెయ్యికి పైగా హై-డెఫినిషన్ సీసీ టీవీలను ఏర్పాటు చేశారు. పోలీసులు ఏఐ గ్లాసెస్ ధరించి అనుమానితులను గుర్తించనున్నారు. ముఖ్యంగా పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ సరిహద్దుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో ఏదైనా గుర్తుతెలియని వస్తువు లేదా అనుమానిత వ్యక్తి కనిపిస్తే వెంటనే 112 నంబర్‌కు డయల్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ అధికారులకు ఐఏఎస్ హోదా

తెలంగాణ బ్యూరో, జనవరి 21 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీస్ అధికారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. వివిధ కేటగిరీల కింద ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తూ మొత్తం 16 మంది అధికారులకు ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ హోదా కల్పిస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ బుధవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది, ఇందులో 2022, 2023, 2024 సంవత్సరాలకు సంబంధించి ఎంపిక చేసిన అధికారులను తెలంగాణ క్యాడర్‌కు కేటాయిస్తూ రాష్ట్రపతి ఆమోదం తెలిపినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఎంపికైన అధికారుల సెలక్షన్ లిస్ట్ -2022లో డి. మధుసూదన్ నాయక్, ఎం.సత్యవాణి, జె.భవానీ శంకర్, జి.లింగయ్య నాయక్, ఎ. నరసింహా రెడ్డిచ, జి. వీరారెడ్డి, జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, యు.రఘురామ్ శర్మ, పి.చంద్రయ్య, జి.ముకుంద రెడ్డి, ఎ.భాస్కర్ రావు ఉన్నారు. ఇక సెలక్షన్ లిస్ట్-2023లో వై.వి.గణేష్, అబ్దుల్ హమీద్, బి.వెంకటేశ్వర్లు ఉన్నారు. సెలెక్ట్ లిస్ట్-2024లో ఎన్.ఖీమ్యా నాయక్, కె.గంగాధర్ ఉన్నారు. అయితే, ఈ నియామకాలు తెలంగాణ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న రిట్ పిటిషన్ (డబ్లూ పీ. 32415/2023) తుది తీర్పునకు లోబడి ఉంటాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సుదీర్ఘ కాలంగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న రాష్ట్ర సివిల్ సర్వీస్ అధికారులకు ఈ నిర్ణయంతో భారీ ఊరట లభించింది.

## బనకచర్ల ప్రాజెక్టుపై సుప్రీంకోర్టుకు "తెలంగాణ ప్రభుత్వం"

మొదటి పేజీ తరువాయి

లీగల్ సమస్యలపై న్యాయ సలహాలు తీసుకుంటోంది. డ్రాఫ్ట్ రెడీ అయ్యాక ఏజీతో చర్చించనుంది. అనంతరం సుప్రీం కోర్టులో సూట్ దాఖలు చేయనుంది. అలాగే తెలంగాణలో చేపడుతున్న సమ్మక్క సాగర్ ప్రాజెక్టు ఎన్వోసీ తీసుకునేందుకు ప్రయత్నం చేస్తోంది. త్వరలో ఛత్తీస్ గఢ్ ప్రభుత్వంతో చర్చలు జరపనుంది. ఈ విషయాన్ని స్వయంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కాగా ఇప్పటికే పోలవరం-నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టుపైనా తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అనుమతులు లేకుండానే నిర్మిస్తున్నారని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌ను వెనక్కి సైతం తీసుకుంది. సివిల్ సూట్ రూపంలో మళ్లీ దాఖలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు కసరత్తులు చేస్తున్న నేపథ్యంలో బనకచర్లపైనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టుపైనా సూట్ వేయాలని నిర్ణయించుకుంది.



## మున్సిపల్ ఎన్నికల వేళ భారీ బదిలీలు



హైదరాబాద్, జనవరి 21 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో రానున్న రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం భారీగా మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలన్న ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ల బదిలీలకు సంబంధించింది పురపాలక పరిపాలన శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి జీవో నెం.87ను విడుదల చేశారు. సొంత జిల్లాల్లో పని చేస్తున్న వారు, ఒకేచోట సుదీర్ఘ కాలం పనిచేస్తున్న అధికారులను పరిపాలనా కారణాలతో పాటు పదోన్నతులపై మొత్తం 47 మందిని బదిలీ చేశారు. అందులో సీ.వీ.ఎన్.రాజు ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్-3) నుంచి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సెక్రటరీగా బదిలీ అయ్యారు. జి.రాజు క్యాతనపల్లి నుంచి ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా నియమితులయ్యారు. ఇక ముసాబ్ అహ్మద్ నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా బి. శ్రీనివాస్ ఆలేరు నుంచి హుజూర్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌గా, డి. జైత్రమ్ పదోన్నతిపై జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. చివరగా బి.శరత్ చంద్ర జీహెచ్ఎంసీ నుంచి ప్రమోషన్‌పై నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా వెళ్లనున్నారు. బదిలీ అయిన అధికారులు వెంటనే తమకు కేటాయించిన కొత్త ప్రాంతాల్లో బాధ్యతలు స్వీకరించాలని జాయింట్ డైరెక్టర్ నారాయణ రావు ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. విధుల్లో చేరడంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రస్తుత నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

## కొత్త పార్టీ దిశగా కవిత వేగంగా అడుగులు



హైదరాబాద్, జనవరి 21 (తీన్మార్ న్యూస్): మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే ఆసక్తి ఉన్న వారికి జాగృతి మద్దతు ఇస్తుందని జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. తాజాగా మీడియాతో చీట్‌చాట్‌లో ఆమె మాట్లాడుతూ వారికి కామన్ సింబల్ కోసం కొన్ని జాతీయ పార్టీలతో మాట్లాడుతున్నామని తెలిపారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో ఉద్యోగులు, యువతకు నష్టం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఐదు శాతం ఓపెన్ కోటాను నాన్ లోకల్ గా మార్చడంతో రాష్ట్ర యువతకు నష్టం జరుగుతోందన్నారు. జాగృతి తరపున అధ్యయనం చేస్తున్నాం, జిల్లాల పునర్విభజన కమిషన్ ఏర్పాటు చేస్తే నివేదిక ఇస్తామన్నారు. కొత్త పార్టీ ఏర్పాటు కసరత్తు వేగంగా జరుగుతోందని జీహెచఎంసీ ఎన్నికల నాటికి ప్రక్రియ పూర్తవుతుందో లేదో చూడాలన్నారు. ఎన్నికల కమిషన్ వద్ద కూడా అడ్డంకులు సృష్టించే అవకాశం లేకపోలేదని అభిప్రాయపడ్డారు. పార్టీకి ఇంకా ఏ పేరు అనుకోలేదు, తెలంగాణ రాష్ట్ర జాగృతి సమితి అని కొందరు సూచించారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ అంశానికి కూడా న్యాయం చేస్తారన్న నమ్మకం తనకు లేదని నైనీ బొగ్గు గని అంశం కంటే సింగరేణికి కొత్త బొగ్గు గనులు వచ్చేలా చూడాలన్నారు. బీఆరఎస్ ఆ అంశం గురించి మాట్లాడకుండా నైనీ అంశాన్ని పట్టుకొంది. సింగరేణిలో సైట్ విజిటింగ్ సర్టిఫికెట్ విధానం ఎప్పట్నుంచో ఉంది, కాంగ్రెస్ వచ్చిన తర్వాత దాన్ని ప్రధాన నిబంధనగా పెట్టారు, కొంత మందికి మాత్రమే సెలెక్టివ్ గా ఇస్తున్నారని కవిత అన్నారు. విచారణ చేయించాల్సిన కాంగ్రెస్ నేతలు లేఖ రాయాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. జాగృతి అధికారంలోకి వచ్చిన తర్వాత 2014 నుంచి సమగ్ర విచారణ చేస్తామని గతంలో సర్పంచులను కలవని వారు ఇప్పుడు వారితో కలిసి ఫోటోలు దిగుతున్నారు, సంతోషమన్నారు. దాంతో సామాజిక తెలంగాణ వైపు కొంత మేర అడుగులు పడుతున్నాయని చెప్పారు. కేసీఆర్ కు నోటీసులు ఇస్తారన్న అంశం గురించి తనకు తెలియదు, తనేను ఇప్పుడు బీఆరఎస్ లో లేనంటు సమాధానమిచ్చారు. జీహెచఎంసీ 300 డివిజన్ల ప్రతిపాదన బీఆరఎస్ హయంలోనిదే, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రతిపాదనను కొనసాగిస్తోందని చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. జాగృతి జనంబాట ముగింపు మార్చ్ పదో తేదీన అనుకుంటున్నాం ఆ తర్వాత బీఆరఎస్, కాంగ్రెస్ మంత్రుల అవినీతిపై ర్యాంకులు ప్రకటిస్తామని స్పష్టం చేశారు. తన టార్గెట్ హరీశ్ రావు, ఇంకా పెద్ద టార్గెట్ ఉందన్నారు. కేటీఆర్ ను కూడా విమర్శించినట్లు చెప్పారు. బలమైన రాజకీయ భవిష్యత్ కోసం పటిష్ట ఎజెండా సిద్ధం చేసుకుంటున్నాను, ఈ దశలో నాకు నేనుగా ఎవరితోనూ మాట్లాడనని తెలిపారు. రాజకీయ కన్సల్టెన్సీలు ఎవరినీ తాను సంప్రదించలేదు, నన్ను సంప్రదించిన కొంత మందితో మాట్లాడానన్నారు.

## హైదరాబాద్‌కు లోరియల్ బ్యూటీ-టెక్ గ్లోబల్ సెంటర్

మొదటి పేజీ తరువాయి

వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ -2026లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లోరియల్ సీఈవో నికోలస్ హియెరోనిమస్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో లో హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులతో బ్యూటీ-టెక్ జీసీసీ ఏర్పాటు చేసే నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ జీసీసీ ఏర్పాటుతో లోరియల్‌కు గ్లోబల్ ఇన్నోవేషన్, టెక్నాలజీ, డేటా, సప్లై చైన్ కార్యకలాపాలకు హైదరాబాద్ కీలక కేంద్రంగా నిలవనుంది. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఏఐ, అనలిటిక్స్ రంగాల్లో రూపొందించే సాంకేతిక పరిష్కారాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న లోరియల్ యూనిట్లకు అందిస్తామని హియెరోనిమస్ తెలిపారు. దీంతో గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్ కార్యకలాపాలకు హైదరాబాద్ ప్రాముఖ్యత మరింత పెరుగనుంది. నవంబర్‌లో జీసీసీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లను లోరియల్ ఆహ్వానించింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ లోరియల్ జీసీసీని హైదరాబాద్‌కు తీసుకురావాలన్న ఆలోచనపై



ముఖ్యమంత్రి ప్రత్యేక ఆసక్తి చూపారని, ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. హైదరాబాద్ పెట్టుబడులకు అనువైన ప్రదేశమని చెప్పారు. మెడ్‌టెక్, హెల్త్‌టెక్ మాత్రమే కాకుండా బ్యూటీ-టెక్ వంటి కొత్త విభాగాల్లోనూ తెలంగాణ ముందుంటోందని మంత్రి అన్నారు. ఇప్పటికే మారియెట్, వ్యాన్ గార్డ్, నెట్ ఫ్లిక్స్, మెక్ డోనాల్డ్స్, హినెకెన్, జాగర్, కోస్ట్కో వంటి గ్లోబల్ కంపెనీలు హైదరాబాద్‌లో జీసీసీలను ఏర్పాటు చేశాయన్నారు. తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ గురించి ప్రతినిధి బృందం ఈ సందర్భంగా వివరించింది. జీసీసీతో పాటు మాన్యుఫాక్షరింగ్ యూనిట్ ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అవకాశాలను పరిశీలించాలని లోరియల్ను ఆహ్వానించారు. రాష్ట్రంలో ఉన్న మౌలిక వసతులు, పరిశ్రమల ఎకోసిస్టమ్‌ను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో తయారీ రంగంలోనూ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు హియెరోనిమస్ సానుకూలంగా స్పందించారు.

# పురపాలక ఎన్నికల నిర్వహణకు సంసిద్ధంగా ఉండాలి

## రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని



ములుగు జిల్లా, జనవరి 21 (తీన్మార్ న్యూస్): పురపాలక ఎన్నికల నిర్వహణకు జిల్లాలో అవసరమైన ఏర్పాట్లు చేసి సంసిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని అన్నారు. మున్సిపల్ ఎన్నికల సన్నద్ధత పై రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్, జిల్లా కలెక్టర్ లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంపత్ రావు తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ త్వరలో కమిషన్ విడుదల చేస్తుందని, షెడ్యూల్ రాగానే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, పులపాలక ఎన్నికల నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, నామినేషన్ పరిశీలన, పోలింగ్ నిర్వహణ కౌంటింగ్ కు అవసరమైన అన్ని ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేసుకోవాలని అన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ను నియమించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్ సౌకర్యం ఉండాలని, ప్రతి పోలింగ్ కేంద్రం బయట సిసి కేమేరా తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సోషల్ ఎలిమెంట్స్ ను బైండోవర్ చేయాలని అన్నారు. ఎన్నికల ప్రచార పరిశీలన, కౌంటింగ్ కేంద్రాలు పోలింగ్ కేంద్రాల వద్ద సాధ్యమైన మేర డ్రోన్ కెమెరాలను వినియోగించాలని సూచించారు. ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించి




మాస్టర్ ట్రైయినర్లు జిల్లాకు చేరుకుంటారని, సిబ్బందికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఎలక్టోరోల్ కు సంబంధించిన అన్ని ఫిర్యాదుల పరిష్కారం చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్, రిసిప్షన్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ, ములుగు కొత్త మున్సిపాల్టీ లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ జాబితా ప్రచురణ పూర్తి చేశామని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్న వసతుల వివరాలు టి- పోల్ లో నమోదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి మునిసిపాలిటీ పరిధిలో అన్ని చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి పోలి కేంద్రం వద్ద వెబ్ కాస్టింగ్, బయట సీసీ కెమెరా ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. బ్యాలెట్ పత్రాల ముద్రణ కొరకు ప్రింటింగ్ ప్రెస్ గుర్తింపు కూడా పూర్తి చేసినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులకు మునిసిపల్ ఎన్నికల సంసిద్ధతపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వన దేవతల సన్నిధిలో భక్త జనసందోహం



ఎస్.ఎస్.తాడ్వాయి, జనవరి 21 (తీన్మార్ న్యూస్): ఎస్.ఎస్.తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మ వన దేవతల సన్నిధిలో భక్త జనసందోహంతో కళకళలాడింది.

బుధవారం అమ్మవార్లకు ప్రత్యేకమైన రోజు కావడంతో ఉదయం నుంచే భక్తులు క్యూ లైన్ ల ద్వారా వనదేవతల దర్శనం చేసుకోవడం జరిగింది. సుమారుగా 75 వేల మంది భక్తులు వనదేవతలను దర్శించుకున్నారని అధికారులు తెలిపారు.

# ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే ప్రభుత్వ లక్ష్యం

### పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నాం



గీసుగోండ, జనవరి 21 (తీన్మార్ న్యూస్): బుధవారం గీసుగోండ మండలంలోని కొనయమాకుల రైతువేదికలో గీసుగోండ మండలం మరియు 15,16 డివిజన్ల పరిధిలోని గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ మరియు సీఎంఆరఎఫ్ చెక్కులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 46 మంది లబ్ధిదారులకు 46 లక్షల 5వేల 336 రూ విలువగల కళ్యాణ లక్ష్మి చెక్కులను మరియు 35 మంది లబ్ధిదారులకు 16 లక్షల 20 వేల రూపాయల విలువగల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశామని తెలిపారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గత ప్రభుత్వ పాలకులు ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని అన్నారు. పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణి లక్ష్మీ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ చీరల పంపిణీ,200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు బీమా, సన్న వడ్లకు రూ 500 బోనస్, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ, వడ్డీ లేని రుణాలు, శ్రీనిధి రుణాలు, ఇందిరమ్మ ఇల్లు తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు.

# త్రాగునీరు అవసరాల కోసం ముందస్తు ప్రణాళికపై సమీక్షా



మహబూబాబాద్ జిల్లా, జనవరి 21 (తీన్మార్ న్యూస్): బుధవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సీఈవో పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, మిషన్ భగీరథ, ఇరిగేషన్, జిల్లాలోని అన్ని మండలాల అభివృద్ధి అధికారులు, ఎంపీఓలు, అసిస్టెంట్ ఇంజనీర్స్, తదితరులతో కలిసి రానున్న వేసవికాల నేపథ్యంలో ప్రజలకు త్రాగునీరు అవసరాల కోసం ముందస్తు ప్రణాళిక కార్యక్రమం తీసుకోవలసిన చర్యలపై జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత వేసవికాలంలో జరిగిన అంశాలను పరిగణంలోకి తీసుకొని రానున్న వేసవికాలం నేపథ్యంలో జిల్లాలోని (18) మండలాలు,మున్సిపల్ పరిధిలో విలేజ్ వాటర్ సప్లై స్పెషల్ డ్రైవ్ ద్వారా ప్రజలకు త్రాగునీరు అందించడంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని (1522) ఓహెచఆరఎస్, (1002,) ఓపెన్ వెల్స్, (2093) హ్యాండ్ పంపులు, తదితర వాటర్ సోర్సులను గమనిస్తూ,పరిరక్షిస్తూ ఉండాలన్నారు, మండల స్థాయి ప్రత్యేక టీములను ఏర్పాటు చేయాలని, త్రాగునీరుకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న టోల్ ఫ్రీ నెంబర్ 1916 లో సంప్రదించాలని, ఈ టోల్ ఫ్రీ నెంబర్ గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జల్ జీవన్ మిషన్, గ్రామీణ నీటి సరఫరాల పథకాల అమలు సమీక్ష నిర్వహించి నివేదికలు సమర్పించాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, నర్సరీల నిర్వహణ, ఐఎచఎస్, తదితర క్షేత్రస్థాయిలో జరిగే కార్యక్రమాల నిత్య పర్యవేక్షణ ఉండాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు సూచించారు. మండల ప్రత్యేక అధికారులు, జిల్లా పంచాయతీ అధికారి, గ్రామీణ అభివృద్ధి అధికారి, జడ్పీ సీఈవో, జిల్లా స్థాయి అధికారుల నుండి గ్రామస్థాయి అధికారి వరకు క్షేత్రస్థాయిలో త్రాగునీరు, సానిటేషన్, పథకాల అమలులో కీలకపాత్ర వహించి ఎలాంటి జాప్యాలు లేకుండా కార్యక్రమాలు నిర్వహించుటకు బాధ్యతగా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మిషన్ భగీరథ, ఇరిగేషన్, పంచాయతీ అధికారి, ఎంపీడీవో లు తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.



# పేద ప్రజలకు అండగా సీఎం సహాయనిధి పథకం

## పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నాం ప్రతి కుటుంబం ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



సంగెం, జనవరి 21 (తీన్మార్ న్యూస్): సంగెం మండల కేంద్రంలోని రైతు వేదికలో కళ్యాణ లక్ష్మి మరియు సీఎంఆర్ ఎఫ్ చెక్కులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. బుధవారం సంగెం మండల కేంద్రంలోని రైతు వేదికలో సంగెం మండలం మరియు 17వ డివిజన్ పరిధిలోని గ్రామాల పరిధిలోని లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ మరియు సీఎంఆరఎఫ్ కు చెక్కులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 61 మంది లబ్ధిదారులకు 61 లక్ష 7వేల 76 రూ విలువగల కళ్యాణ లక్ష్మి చెక్కులను అలాగే 62 మంది లబ్ధిదారులకు 25 లక్షల 60వేల రూ విలువగల సీఎంఆరఎఫ్ చెక్కులను పంపిణీ చేశామన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గ వ్యాప్తంగా 2576 మంది కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు 25 కోట్ల 78 లక్షల 98వేల 816 రూ మరియు 2437 మందికి సీఎంఆరఎఫ్ ద్వారా 8 కోట్ల 14 లక్షల 88వేల రూ చెక్కులను పంపిణీ చేసామన్నారు. నిరుపేదలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకంతో రాష్ట్రంలోని ఎంతోమంది నిరుపేద కుటుంబాలకు ఆడపిల్లల పెళ్లి భారం తగ్గిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వా నిర్లక్ష్యం వైఖరి వల్ల కళ్యాణ లక్ష్మి చెక్కులు ఆలస్యం అయ్యాయని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో సకాలంలో లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను అందేలా కృషి చేస్తామని తెలిపారు. పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని, ఇది ప్రజల ప్రభుత్వం అని అన్నారు. అనారోగ్య కారణాలతో ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారికి ప్రభుత్వం తరఫున బాధ్యతగా నేరుగా ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నామని తెలిపారు.

# పురపాలక ఎన్నికల నిర్వహణకు సంసిద్ధంగా ఉండాలి






## రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని

మహబూబాబాద్ జిల్లా, జనవరి 21 (తీన్మార్ న్యూస్): పురపాలక ఎన్నికల నిర్వహణకు జిల్లాలో అవసరమైన ఏర్పాట్లు చేసి సంసిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని అన్నారు. మున్సిపల్ ఎన్నికల సన్నద్ధత పై రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్, జిల్లా కలెక్టర్ లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, రెవెన్యు అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ త్వరలో కమిషన్ విడుదల చేస్తుందని, షెడ్యూల్ రాగానే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, పులపాలక ఎన్నికల నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, నామినేషన్ పరిశీలన, పోలింగ్ నిర్వహణ కౌంటింగ్ కు అవసరమైన అన్ని ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేసుకోవాలని అన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతను నియమించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్ సౌకర్యం ఉండాలని, ప్రతి పోలింగ్ కేంద్రం బయట సిసి కేమేరా తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సోషల్ ఎలిమెంట్స్ ను బైండోవర్ చేయాలని అన్నారు. ఎన్నికల ప్రచార పరిశీలన, కౌంటింగ్ కేంద్రాలు పోలింగ్ కేంద్రాల వద్ద సాధ్యమైన మేర డ్రోన్ కెమెరాలను వినియోగించాలని సూచించారు. ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించి మాస్టర్ ట్రైయినర్లు జిల్లాకు చేరుకుంటారని, సిబ్బందికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఎలక్టోరోల్ కు సంబంధించిన అన్ని ఫిర్యాదుల పరిష్కారం చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్, రిసిప్షన్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులకు మునిసిపల్ ఎన్నికల నిర్వహణ, సంసిద్ధతపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జెడ్.పి సీఈఓ పురుషోత్తం, మహబూబాబాద్ ఆర్.డి.ఓ కృష్ణవేణి, డి.పి.ఓ హరిప్రసాద్, డీఈవో రాజేశ్వర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, మహబూబాబాద్, తొర్రూరు, కేసముద్రం, డోర్నకల్, మరిపెడ మునిసిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి

## ప్రతి ఒక్కరూ రూల్స్ పాటించాలి

### జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్ జిల్లా, జనవరి 21 (తీన్మార్ న్యూస్): రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగానే జిల్లాలో విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు అన్ని విభాగాలలో విధిగా పోలీస్ రవాణా శాఖ సంబంధిత అన్ని విభాగాల అధికారులు విస్తృతం ప్రచారం కల్పించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు, జిల్లాలో మరిపెడ, కురవి, తొర్రూరు, నెల్లికుదురు, బయ్యారం, హైవేల వెంబడి ప్రమాదాలు జరుగుతున్నాయని, నివారణ కోసం సంబంధిత విభాగాలు ప్రతిపాదనలు సిద్ధం చేసి చిన్నచిన్న రోడ్డు మరమ్మత్తులు ఉంటే వెంటనే సరి చేయాలని విషయ సూచికలు ఏర్పాటు చేయాలని, త్రాగి వాహనాలు నడపకుండా తగిన జాగ్రత్తలు తనిఖీలు నిర్వహించాలని, సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించి జీబ్రా క్రాసులు ట్రాఫిక్ రూల్స్ పక్కాగా పాటిస్తూ ఉండే విధంగా సామాన్య ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. స్కూల్ బస్సుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టి ఫిట్నెస్ ఉన్నాయా లేవో తనిఖీ చేయాలని, డ్రైవర్ సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపకుండా అతనికి తగు ఆదేశాలు జారీ చేయాలని, నిత్యం వారికి వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ కంటిచూపు తదితర అన్ని తనిఖీ చేయాలని సూచించారు, ఆర్టీసీ బస్సుల డ్రైవర్ల యొక్క ఆరోగ్య స్థితిగతులను పరిశీలిస్తూ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించాలని అన్నారు, అధిక లోడు, అతివేగం, రాష్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా, నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపే ప్రతి ఒక్కరి పైన ప్రభుత్వ సూచనల ప్రకారం జరిమానాలు విధించాలని, ప్రభుత్వ కార్యాలయాలలో విధిగా హెల్మెట్ ధరిస్తేనే కార్యాలయానికి అనుమతించే విధంగా ముందస్తు సమాచారంతో తెలియజేయాలని సూచించారు. పోలీస్, రవాణా సమన్వయంతో క్షేత్రస్థాయిలో అవగాహన (ప్రచార) కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, అదే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించి వారి క్షేమం వారి కుటుంబ క్షేమం కోసం కృషి చేయాలన్నారు. నేషనల్ హైవే, మున్సిపల్, పంచాయితీ రాజ్, రోడ్లు భవనాల శాఖ రహదారుల వెంబడి బ్లాక్ స్పాట్స్ గుర్తించి నివారణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతిరావు, ఆర్డీవో జైపాల్ రెడ్డి, ఆర్ అండ్ బి, పిఆర్ ఈఈలు భీమ్లా నాయక్, విద్యాసాగర్, సంబంధిత విభాగాల అధికారులు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధతతో ఉండాలి

### రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 21 (తీన్మార్ న్యూస్): మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని స్థాయిల్లో పూర్తి సన్నద్ధతతో ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల కార్యాలయం నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఐడీఓసీ కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహణకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియలో ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. నామినేషన్లు స్వీకరించే కేంద్రాల్లో గోడ గడియారం ఏర్పాటు చేయడంతో పాటు, నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఆర్‌ఓలు, ఏఆర్‌ఓల నియామకాలు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది నియామకంలో 20 శాతం అదనపు సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని తెలిపారు. నూరు శాతం బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధంగా ఉండాలని, పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలను ముందుగానే పరిశీలించాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు సెక్షన్ 163 బిఎన్‌ఎస్‌ఎస్ ఉత్తర్వులు జారీ చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జోనా తదితరులు పాల్గొన్నారు.

# అసంఘటిత రంగ కార్మికులకు కేంద్రం తీపి కబురు




మొదటి పేజీ తరువాయి

మరో ఐదేళ్ల పాటు కొనసాగించేందుకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బుధవారం ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ ఏపీవై స్కీమ్ ను 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఈ పథకానికి మరింత విస్తృత ప్రచారం కల్పించడం, అభివృద్ధికి కృషి చేయాలని అందుకు తగిన నిధులు కేటాయించాలని కేబినెట్ నిర్ణయించింది. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు 60 ఏళ్లు దాటాక పెన్షన్ అందించాలనే ఉద్దేశంతో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం 2015లో ఈ అటల్ పెన్షన్ యోజన పథకాన్ని తీసుకువచ్చింది. 2026 జనవరి 19 నాటికి ఈ పథకంలో 8.68 కోట్ల మంది చందాదారులుగా చేరినట్లు కేంద్ర గణాంకాలు చెబుతున్నాయి.

### ఈ స్కీమ్ లో చేరడం

18-40 సంవత్సరాల మధ్య వయసు ఉన్న వారు ఈ స్కీమ్‌లో చేరేందుకు అర్హులు. ఈ పెన్షన్ పథకంలో పెట్టుబడి పెట్టాలని భావించే వారు పోస్ట్ ఆఫీస్, లేదా ఏదైనా ప్రభుత్వం రంగ బ్యాంక్ ఖాతాలో గానీ సేవింగ్ అకౌంట్ కలిగి ఉండాలి. ఈ స్కీమ్ లో చేరేవారు 60 ఏళ్లు నిండిన తర్వాత నెలకు రూ. 1,000, రూ.2,000, రూ.3,000, రూ.4,000 లేదా రూ.5,000 పెన్షన్ పొందుకునేలా ఏదో ఓ స్లాబ్ ఎంచుకోవాలి. చందాదారులు ఎంచుకున్న పెన్షన్ మొత్తం, పథకంలో చేరినప్పటి వయసును బట్టి తాము చెల్లించాల్సిన నెలవారీ ప్రీమియం మారుతుంది. ఎంత త్వరగా (తక్కువ వయసులో) చేరితే ప్రీమియం అంత తక్కువగా చెల్లించాల్సి వస్తుంది. కాగా అక్టోబర్ 1, 2022 నుంచి అమల్లోకి వచ్చిన నిబంధన ప్రకారం ఆదాయపు పన్ను చెల్లించేవారు ఈ పథకంలో చేరడానికి అనర్హులు.

# ఎర్రవల్లిలో కేసీఆర్‌తో హరీశ్ రావు కీలక భేటీ

మొదటి పేజీ తరువాయి



మంగళవారం సిట్ విచారణకు హరీశ్ రావు హాజరైన నేపథ్యంలో ఈ విచారణ జరిగిన మరుసటి రోజే కేసీఆర్ తో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ భేటీ సందర్భంగా విచారణలో అధికారులు అడిగిన ప్రశ్నలు తాను ఇచ్చిన సమధానాలపై హరీశ్ రావు కేసీఆర్ తో చర్చించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తాజా రాజకీయ పరిణామాలపై హరీశ్ రావుకు గూలాబీ బాస్ దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది.

### సేమ్ సీన్ రిపీట్ కాబోతోందా?

ఫోన్ ట్యాపింగ్‌లో జరుగుతున్న పరిణామాలు బీఆరస్ పార్టీలో ఉత్కంఠ రేపుతున్నాయి. మంగళవారం హరీశ్ రావును దాదాపు 7 గంటలకు పైగా సిట్ ప్రశ్నించింది. అయితే హరీశ్ రావును ప్రశ్నించడంతో ఇక సిట్ తదుపరి టార్గెట్ ఎవరు అనే చర్చ జరుగుతోంది. ఇప్పటి వరకు విచారణ ఎదుర్కొన్న వారిలో ఎక్కువ మంది 'పెద్దాయన' ఆదేశాల మేరకే ఇందంతా చేశామని చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఆ పెద్దాయన కేసీఆరేనని ఈ కేసులో నెక్ట్స్ నోటీసులు కేసీఆర్ కే అనే టాక్ వినిపిస్తోంది. ఇదిలా ఉంటే గతంలో కాళేశ్వరం కమిషన్ విచారణను ఈ సందర్భంగా బీఆరస్ శ్రేణులు గుర్తు చేసుకుంటున్నాయి. నాడు జరిగిన పరిణామాలే ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ జరుగుతున్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ సమయంలో హరీశ్ రావును ప్రశ్నించారు. ఆ తర్వాత ఆయన ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్‌లో కేసీఆర్ ను కలిశారు. ఆ సమయంలో ఏయే ప్రశ్నలు అడిగారు వాటికి తాను ఇచ్చిన సమాధానాలేంటి అనే అంశంపై ఇరువురు చర్చించినట్లు ప్రచారం జరిగింది. అయితే కేసీఆర్ ను హరీశ్ రావు కలిసిన తర్వాత కొంత కాలానికే పీసీ ఘోష్ కమిషన్ కేసీఆర్ కు నోటీసులు ఇచ్చింది. ఇప్పుడు కూడా ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ ముగియగానే హరీశ్ రావు కేసీఆర్ తో భేటీ కావడంతో నాడు జరిగిందే ఇప్పుడు మళ్లీ జరగబోతోందా? నెక్ట్స్ కేసీఆర్ కు నోటీసులు రాబోతున్నాయా అనేది ఉత్కంఠగా మారింది.

# అవగాహనతోనే రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట

### జిల్లా రవాణా శాఖ అధికారి మహమ్మద్ సంధాని




భూపాలపల్లి, జనవరి 21 (తీన్మార్ న్యూస్): దేశం అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో 4వ స్థానంలో ఉన్నప్పటికీ, రోడ్డు ప్రమాదాల్లో మొదటి స్థానంలో ఉండటం ఆందోళనకరమని జిల్లా రవాణా శాఖ అధికారి మహమ్మద్ సంధాని అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలు గత 37 సంవత్సరాలుగా వారోత్సవాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రమాదాలు తగ్గడం లేదని పేర్కొన్నారు. అందుకే నెల రోజుల పాటు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం మంజూరు నగర్‌లోని మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలల్లో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం 2026 సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మీ ద్వారా తల్లిదండ్రులకు కూడా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని విద్యార్థులను సూచించారు. నడిచేటప్పుడు, వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. మోటారు సైకిళ్ల ద్వారానే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, చిన్న చిన్న లోపాలను సరిదిద్దుకొని మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని తెలిపారు. సక్రమంగా వెళ్లకపోవడం, అశ్రద్ధ, సెల్‌ఫోన్ మాట్లాడుతూ నడవడం లేదా వాహనం నడపడం, జిగ్‌జాగ్‌గా వెళ్లడం, అతివేగం వంటి కారణాల వల్ల వాహనం నడిపే సమయంలో ధ్యాస లేక ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చునే వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులచే రోడ్డు భద్రతా నియమాలపై ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్వో శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ రవి, ఏఎంవిఐలు శ్రీనివాస్, సుందర్ లాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కేఎంకే ఫుడ్ కోర్ట్‌ను ప్రారంభించిన దాస్యం వినయ్ భాస్కర్



హనుమకొండ, జనవరి 21 (తీన్మార్ న్యూస్): భారత రాష్ట్ర సమితి పార్టీ గ్రేటర్ వరంగల్ 4వ డివిజన్ అధ్యక్షులు డా.కంజర్ల మనోజ్ కుమార్ నూతనంగా ఏర్పాటు చేసిన కేఎంకే ఫుడ్ కోర్ట్‌ను ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు, బీఆరఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ ప్రారంభించారు. హనుమకొండ నయీంనగర్ పెద్ద మోరి వద్ద ఏర్పాటు చేసిన షాప్‌ను ఆయన మనోజ్ కుమార్ కుటుంబసభ్యులతో కలిసి బుధవారం ఉదయం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో ఉంటూ స్వయం ఉపాధి, వ్యాపార రంగంలో వృద్ధి చెందాలని తద్వారా ఆర్థిక స్థితిగతులు మెరుగవుతాయని అన్నారు. కుటుంబానికి అండగా నిలవడంతో పాటు ఆర్థికంగా మరింత వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, కార్పొరేటర్లు చెన్నం మధు, సోదా కిరణ్, మాజీ డిప్యూటీ మేయర్ సిరాజుద్దీన్, ప్రముఖ నాయకులు నరెడ్ల శ్రీధర్, రఘు, రజినీ కుమార్, చాడ శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఉడతల సారంగపాణి, నాయకులు పున్నం చందర్, కొండ శ్రీనివాస్, మూటిక రాజు యాదవ్, దశరథం, మనోహర్, ప్రదీప్, సుధాకర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 21 (తీన్మార్ న్యూస్): 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఈ సందర్భంగా బుధవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డా బిఆర్ అంబేద్కర్ క్రీడా మైదానంలో జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు మైదానం పూర్తిగా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆహూతులు సౌకర్యవంతంగా కూర్చునేందుకు షామియానాలు, కుర్చీలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించే విధంగా సింగరేణి, విద్యా, డిఆర్‌డీఓ, గృహ నిర్మాణ, సంక్షేమ, వ్యవసాయ, ఉద్యాన, వైద్య శాఖల అధికారులు స్టాళ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని విద్యా శాఖ అధికారిని ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించే ప్రసంగ పాఠాన్ని సిద్ధం చేయాలని డిపిఆర్ఓను కలెక్టర్ ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఈ సందర్భంగా సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఏఎస్పి నరేష్ కుమార్, ఆర్డిఓ హరికృష్ణ, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి అక్రమాలపై సమగ్ర విచారణ జరగాలి

## కాంగ్రెస్, బీఆరస్ పార్టీలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నిప్పులు



తెలంగాణ బ్యూరో, జనవరి 21 (తీన్మార్ న్యూస్): భారతదేశ ఇంధన అవసరాలను తీర్చడంలోనూ, బొగ్గు ఉత్పత్తిలోనూ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కొనియాడారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో సింగరేణి కార్మికుల పోరాటం చిరస్మరణీయమని గుర్తుచేశారు. 'సకల జనుల సమ్మె' నుంచి ప్రతి చిన్న ఆందోళన వరకు సింగరేణి భాగస్వామ్యం రాష్ట్ర ఏర్పాటుకు ఎంతో బలాన్ని ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. దేశం మొత్తం మీద అత్యధిక బొగ్గును ఉత్పత్తి చేసే ప్రధాన సంస్థలలో ఒకటిగా సింగరేణి వెలుగొందుతోందని ఆయన ప్రశంసించారు. రాష్ట్రం ఏర్పడక ముందు ఆరంభంలో అద్భుతమైన లాభాలతో సాగిన సింగరేణి, ప్రస్తుతం అనేక ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సంస్థ నిర్వహణలో వస్తున్న మార్పులు, కొన్ని నిర్ణయాల కారణంగా సంస్థ పరిస్థితి దిగజారుతోందని ఆయన విమర్శించారు. ఒకప్పుడు లాభాల బాటలో ఉన్న సంస్థ, ఇప్పుడు సమస్యల వలయంలో చిక్కుకోవడం దురదృష్టకరమని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

### టెండర్ల రద్దు సింగరేణికి అన్యాయం చేయడమే

ప్రస్తుతం నైనీ కోల్ బ్లాక్‌పై విస్తృతంగా చర్చ జరుగుతోందని కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణకు గుండెలాంటిది సింగరేణి అని అన్నారు. కానీ, సింగరేణిని బంగారు బాతులా కాంగ్రెస్ వాడుకుంటున్నారని కామెంట్ చేశారు. అవినీతి, అక్రమాలకు కేంద్రంగా సింగరేణి మారిందన్నారు. తెలంగాణ విద్యుత్ సంస్థలకు బొగ్గును అందించాలని కేంద్రం నైనీ కోల్ బ్లాక్-2ను తెలంగాణకు కేటాయించిందని అన్నారు. గతంలో బీఆరస్, ఇప్పుడు కాంగ్రెస్‌ను సింగరేణిని వాడుకుంటున్నాయని తెలిపారు. నైనీ కోల్ బ్లాక్ విషయంలో కేంద్రం సహకారం అందిస్తోందని, ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక అక్కడి ప్రభుత్వంతో అనుమతులపై చర్చించానన్నారు. నైనీ బొగ్గు గనులకు చివరి అనుమతులు వచ్చాక టెండర్లు పూర్తి చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నాన్చుతోందని అన్నారు. టెండర్లను రద్దు చేయడం సింగరేణికి ప్రత్యక్షంగా అన్యాయం చేయడమేనని పేర్కొన్నారు. సైట్ విజిట్‌కు సింగరేణి సర్టిఫికెట్ ఇవ్వాలనే నిబంధన పెట్టారని గుర్తుచేశారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ అనేది సెల్ఫ్ సర్టిఫికేషన్ నిబంధన మాత్రమేనని అన్నారు. కానీ, సింగరేణి ఇవ్వాలనే నిబంధన పెట్టడం ఏంటని ప్రశ్నించారు. దీని అర్థం.. వారికి నచ్చిన వారికి నైనీ బ్లాక్ ఇవ్వాలని చూస్తున్నారని కామెంట్ చేశారు.

### మంత్రుల మధ్య వాటాల వివాదంతోనే



గతంలో సింగరేణి మైనింగ్ చేస్తామని ముందుకొస్తే బీఆరస్ బెదిరించి ప్రైవేటు సంస్థలకు బ్లాక్‌లు వెళ్లేలా వ్యవహరించిందని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే పంథాను కొనసాగిస్తోందని కిషన్ రెడ్డి అన్నారు. తాడిచర్ల కోల్ బ్లాక్‌ను కేంద్రం జెన్‌కోకు కేటాయించిందని తెలిపారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం రూ.47 వేల కోట్ల బకాయి ఉందని, గ్రేడ్-11 కోల్‌ను టన్నుకు రూ.4,800కి అమ్ముతోందని అన్నారు. కోల్ ఇండియా గ్రేడ్-11 కోల్‌ను రూ.1,605కి అమ్ముతోందని తెలిపారు. సింగరేణి బొగ్గు క్వాలిటీ కూడా తగ్గుతోందని, ఏపీ సహా పలు రాష్ట్రాలు కొనుగోలుకు వెనకడుగు వేస్తున్నాయని అన్నారు. ఏది ఏమైనా సింగరేణి అక్రమాలపై దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో రాష్ట్రం ముందుకొస్తే కేంద్రం పరిశీలిస్తుందని, సింగరేణిని పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రుల మధ్య వాటాల వివాదంతోనే సింగరేణి అంశం వెలుగులోకి వచ్చిందని, నైనీ బ్లాకే కాదు పూర్తి స్థాయిలో దర్యాప్తు జరగాలన్నారు. సింగరేణి నిర్వహణ బాధ్యత కేంద్ర తీసుకుంటుందని విచారణపై సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాస్తానని కిషన్ రెడ్డి అన్నారు.

### వాటాల వివరాలపై స్పష్టత

సింగరేణి సంస్థపై పూర్తి హక్కులు కేంద్రానివే అన్నట్లుగా జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఈ సందర్భంగా సంస్థలోని వాటాల వివరాలను ఆయన స్పష్టం చేశారు. సింగరేణిలో తెలంగాణకు 51 శాతం వాటా ఉండగా, కేంద్రానిది 49 శాతం వాటా ఉందన్నారు. మెజారిటీ వాటా రాష్ట్ర ప్రభుత్వం వద్దే ఉన్నందున, సంస్థను కాపాడుకోవడంలో రాష్ట్రం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ సింగరేణి అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు.

# హైదరాబాద్‌లో మినీ దావోస్



తెలంగాణ బ్యూరో, జనవరి 21 (తీన్మార్ న్యూస్): స్విట్జర్లాండ్ లోని దావోస్ వేదికగా జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక వినూత్న ప్రతిపాదన ఉంచారు. ప్రతి సంవత్సరం జూలై - ఆగస్టు నెలల్లో హైదరాబాద్‌లో 'మినీ దావోస్' తరహాలో ఫోరమ్ ఫాలో-అప్ సదస్సును నిర్వహించాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. పెట్టుబడి ఒప్పందాలు, వాణిజ్య నిర్ణయాలకు ఏడాది కాలం చాలా ఎక్కువని, అందుకే ఆరు నెలలకోసారి సమీక్షా సమావేశం అవసరమని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు ఏకగ్రీవంగా మద్దతు పలికారు. ఇదే వేదికపై సీఎం 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను ప్రదర్శిస్తూ, 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ' మూసీ పునరుజ్జీవనం ద్వారా హైదరాబాద్‌ను 24 గంటలు పనిచేసే నగరంగా మారుస్తామని సీఎం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం 'తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్', 'నెక్స్ట్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-2030'లను అధికారికంగా ఆవిష్కరించింది. 2030 నాటికి లైఫ్ సైన్సెస్ రంగంలో వి250 బిలియన్ల ఆర్థిక వ్యవస్థను సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి మెట్రో రైలు విస్తరణ, కొత్త ఆర్థిక వృద్ధి జోన్ల ప్రణాళికలను వివరించగా, ప్రముఖ సినీ నటుడు చిరంజీవి ఈ సమావేశంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ముఖ్యమంత్రితో కలిసి విందులో పాల్గొన్నారు. ఇటీవల నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ద్వారా ఇప్పటికే రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని, రానున్న రోజుల్లో తెలంగాణను గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ం

# పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులే వారధులు

### ఐటీసీ వావ్ పురస్కారాల ప్రదానోత్సవంలో గవర్నర్

### విద్యార్థులకు సామాజిక బాధ్యతపై గవర్నర్ దిశానిర్దేశం




హైదరాబాద్, జనవరి 21 (తీన్మార్ న్యూస్): విద్యార్థులకు తరగతిగదిలో పాఠాలు మాత్రమే కాదు ప్రపంచాన్ని కూడా పరిచయం చేయాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో ఐటీసీ లిమిటెడ్ ఫ్లాగ్ షిప్ కార్యక్రమం వెల్ బీయింగ్ అవుట్ ఆఫ్ వేస్ట్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రీ సైక్లింగ్ ఛాంపియన్లకు ఐటీసీ వావ్ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణ విషయంలో ఒక స్పష్టత ఉండేలా కార్యక్రమాలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాతలుగా విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. స్వచ్ఛభారత్ లో పిల్లలను భాగస్వాములను చేయడం ప్రశంసనీయమన్నారు. వ్యర్థాల విభజన, రీ సైకిలింగ్ కార్యక్రమంలో విద్యార్థులను విద్యాసంస్థలను భాగస్వామ్యం చేయడం వలన చిన్న వయసు నుంచి పర్యావరణ బాధ్యత సుస్థిర సంస్కృతి పెంపొందుతాయని తెలియజేశారు. అనంతరం రీ సైక్లింగ్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

# ఎమ్మెల్యే విజయుడిపై "ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి"

### కాంగ్రెస్ తీరుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం






హైదరాబాద్, జనవరి 21 (తీన్మార్ న్యూస్): అలంపూర్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ నాయకుడు విజయుడిపై కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి దుర్భాషలాడుతూ చేయి చేసుకోవడం ప్రజాస్వామ్యంపై జరిగిన బహిరంగ దాడిగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభివర్ణించారు. ప్రతిపక్షాన్ని భయపెట్టేందుకు, గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ నేతలు దిగజారిన రాజకీయానికి ఇది నిదర్శనం అంటూ ట్వీట్ చేశారు. ప్రజలతో ఎన్నికైన ఎమ్మెల్యేను అవమానిస్తూ, శారీరక దాడికి దిగడం కాంగ్రెస్ సంస్కృతి ఎంత దిగజారిందో అర్థమవుతోంది. చట్టం, రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలపై కాంగ్రెస్‌కు గౌరవం లేదని ఈ ఘటన మరోమారు స్పష్టం చేస్తోంది. బీఆర్ఎస్ పార్టీ ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తోంది. ఎంపీ మల్లు రవి తక్షణమే క్షమాపణ చెప్పాలి. సీఎం రేవంత్ రెడ్డి నైతిక బాధ్యత వహించి చర్యలు తీసుకోవాలి. ప్రతిపక్షాన్ని బెదిరింపులతో కాదు, ప్రజల తీర్పుతోనే ఎదుర్కోవాలి. బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేస్తే చూస్తూ ఉరుకోము. ప్రజాస్వామ్య పద్ధతుల్లో గట్టిగా ఎదుర్కొంటాం అని కేటీఆర్ హెచ్చరించారు.

# సింగరేణిపై విచారణకు మేం సిద్ధం

### హరీష్ రావు.. సవాల్‌ను స్వీకరిస్తారా..

### మంత్రి పొన్నం ప్రభాకర్ ఓపెన్ ఛాలెంజ్

హైదరాబాద్, జనవరి 21 (తీన్మార్ న్యూస్): తెలంగాణకు నిధుల కేటాయింపులో అన్యాయం జరుగుతోంది, కేంద్రాన్ని అడుగుదామంటే రమ్మంటే ప్రతిపక్ష నేతలెవ్వరూ ముందుకురారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. అలాంటి ప్రతిపక్ష బీఆరస్ నేతలు సింగరేణిపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బీఆరస్ నేతలు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎలాంటి ఎంక్వైరీకైనా తాము సిద్ధంగా ఉన్నామని, దీనిపై విచారణ చేయాలని సీఎంను కోరుతామన్నారు.

### హరీష్ రావుకు ఓపెన్ ఛాలెంజ్

బీజేపీ, బీఆరస్ కుమ్మక్కయ్యాయని, ఆ రెండూ కలిసే తాము సేఫ్ గా ఉంటామని బీఆరస్ భావిస్తోందన్నారు. అందుకే కాళేశ్వరంపై సీబీఐ విచారణ చేయించాలని డిమాండ్ చేశారన్నారు. తీరా సీబీఐ విచారణకు ఇస్తే కిషన్ రెడ్డి, హరీష్ రావు కలిసి సింగరేణి అంశాన్ని తెరపైకి తెచ్చారన్నారు. ఇప్పుడు ఈ విషయంపై సీబీఐ ఎంక్వైరీకి డిమాండ్ చేస్తున్నారని మండిపడ్డారు. సింగరేణి అలాట్మెంట్స్ ను తెప్పించి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని పొన్నం ప్రభాకర్ హరీష్ రావు, కిషన్ రెడ్డిలను డిమాండ్ చేశారు. 2014 నుంచి సింగరేణిలో ఇచ్చిన ఒకే ఒక్క కాంట్రాక్ట్ తప్ప మిగతా కాంట్రాక్టులన్నీ ఎక్స్ ట్రాగానే ఇచ్చారని నిరూపించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, ఇందుకు హరీష్ రావు సిద్ధమా? అని మంత్రి పొన్నం ఓపెన్ ఛాలెంజ్ చేశారు.





# తెల్ల బియ్యంకు బదులుగా ఈ రైస్‌ను తరచూ తినండి..

## ఎంతో మేలు జరుగుతుంది..

బియ్యం మన ఆహారంలో ముఖ్య భాగం. మనం ఎంతో కాలంగా తెల్ల బియ్యాన్ని ఆహారంలో భాగంగా తీసుకుంటున్నాం. తెల్ల బియ్యాన్ని వండడం కూడా చాలా సులభం. అయితే తెల్లబియ్యంలో అధిక గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది. దీనిని తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి. కనుక డయాబెటిస్ తో బాధపడే వారు తెల్లబియ్యాన్ని తీసుకోకూడదని వైద్యులు సూచిస్తూ ఉంటారు. ఆరోగ్యకరమైన వ్యక్తులైనా సరే తెల్లబియ్యాన్ని అధికంగా తీసుకోకూడదని దీని వల్ల భవిష్యత్తులో షుగర్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని కూడా వైద్యులు చెబుతూ ఉంటారు. అయితే మనలో చాలా మందికి అన్నం తినందే భోజనం చేసినట్టుగా ఉండదు. అలాంటి వారు తెల్లబియ్యానికి బదులుగా ఇతర రైస్ లను తీసుకోవచ్చు.



### అనేక వెరైటీలు..


బ్రౌన్ రైస్, రెడ్ రైస్, వైల్డ్ రైస్, బ్లాక్ రైస్, బాస్మతి రైస్ వంటి వాటిని తెల్లబియ్యానికి ప్రత్యామ్నాయంగా మనం తీసుకోవచ్చు. వీటిలో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఈ రైస్ లను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉంటాయి. డయాబెటిస్ ఉన్న వారికి ఇవి ఎంతో మేలు చేస్తాయి. బ్రౌన్ రైస్ లో ఫైబర్ అధికంగా ఉంటుంది. వీటితో అన్నాన్ని వండి తీసుకోవడం వల్ల జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. తద్వారా రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరగకుండా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల చక్కెర స్థాయిలల్లో ఆకస్మికంగా వచ్చే హెచ్చుతగ్గులను నివారించవచ్చు. బ్రౌన్‌రైస్ తో అన్నాన్ని వండుకుని తినడం వల్ల ఎక్కువ సమయం కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో శరీర బరువు కూడా అదుపులో ఉంటుంది.

### రెడ్ రైస్ అయితే..

ఇక రెడ్‌రైస్ లో ఆంథోసైనిన్స్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. వీటితో పాటు ఫైబర్, ఖనిజాలు కూడా పుష్కలంగా ఉంటాయి. రెడ్‌రైస్ తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ను కలిగి ఉంటుంది కనుక రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. ఈ రైస్ ను తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యానికి కూడా మేలు కలుగుతుంది. వైల్డ్ రైస్ సాంకేతికంగా గడ్డి లాటింది కానీ దీనిలో ప్రోటీన్, ఫైబర్, పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. వైల్డ్ రైస్ జీర్ణక్రియ నెమ్మదిగా అయ్యేలా చేస్తుంది. కనుక ఈ రైస్ ను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇది ఒక అద్భుతమైన ఎంపిక అని చెప్పవచ్చు.

### బ్లాక్ రైస్‌లో..

అదే విధంగా బ్లాక్ రైస్ లో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ సమ్మేళనాలు పుష్కలంగా ఉంటాయి. దీనిలో ఉండే ఫైబర్ గ్లూకోజ్ శోషణను నియంత్రిస్తుంది. అలాగే జీర్ణక్రియ ఆరోగ్యానికి, పేగు ఆరోగ్యానికి బ్లాక్ రైస్ ఎంతో మేలు చేస్తుంది. అదే విధంగా బాస్మతిరైస్ కూడా తెల్లబియ్యం కంటే తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ను కలిగి ఉంటుంది. బాస్మతిబియ్యం కూడా రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడంలో సహాయపడతాయి. డయాబెటిస్ తో బాధపడే వారు, డయాబెటిస్ వచ్చే అవకాశం ఉన్న వారు తెల్లబియ్యానికి ప్రత్యామ్నాయంగా ఇతర రైస్‌లను కూడా తీసుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఈ రైస్ లను తీసుకోవడం వల్ల డయాబెటిస్ అదుపులో ఉండడంతో పాటు మొత్తం ఆరోగ్యానికి కూడా మేలు కలుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు.



# నోటి పూత.. పదే పదే రావడానికి కారణాలు ఇవే.!

నోటి పూత అనేది చాలా సాధారణ సమస్య. కొన్ని రోజులపాటు వచ్చే పూతలు సాధారణంగా తేలికపాటి ఇన్ఫెక్షన్, జీర్ణ సమస్యల వల్ల వస్తాయి. కానీ, పదే పదే నోటి పూతలు రావడం తీవ్రమైన అనారోగ్యానికి సంకేతం కావచ్చు. కాబట్టి దాన్ని గమనించి, సరైన చర్యలు తీసుకోవడం అవసరం. అయితే.. నోటి పూతలు తరచుగా రావడానికి ప్రధాన కారణాలు ఏంటి? వాటిని ఎలా వదిలించుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం..

### నోటి పూతకు సాధారణ కారణాలు

శరీరంలో ఫోలిక్ యాసిడ్ లేదా ఐరన్ లోపం
జీర్ణ సమస్యలు, అలసట
ఎక్కువ కారంగా ఉన్న ఆహారం తినడం
కొంతమందిలో పూతలు ప్రతి 3--4 నెలలకు ఒకసారి వస్తాయి, మాయమవుతాయి. కానీ కొన్ని రోజులకోసారి పునరావృతం అవుతుంటే వైద్య సలహా అవసరం.

### ప్రమాదకరం..

- ప్రతి నెలా పదే పదే నోటి పూతలు రావడం, నోటి నుంచి స్వల్ప రక్తస్రావం, బరువులో తేడాలు లేదా తగ్గడం లేదా ఒక నెలపాటు కూడా నోటిపూత తగ్గకపోవడం వంటి సమస్యలు ఉన్నప్పుడు జాగ్రత్త పడటం మంచిది. ఈ లక్షణాలు నోటి క్యాన్సర్, పేగు వ్యాధులు, థైరాయిడ్ సమస్యలు, మధుమేహం, కొన్నిసార్లు ఎ×ఎ వైరస్ వంటి ఆరోగ్య సమస్యలతోనూ సంబంధం ఉండవచ్చు.
- ధూమపానం లేదా పొగాకు అలవాటు ఉన్నవారికి నోటి పూత రావడం ఎక్కువ ప్రమాదకరం, ఎందుకంటే పొగాకు వల్ల నోటి మ్యూకస్ లైనింగ్ దెబ్బతినే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- డయాబెటిక్ రోగులకు కూడా నోటి పూతలు ఎక్కువగా కనిపించే అవకాశం ఉంది. అలాగే విటమిన్ బీ12 లోపం ఉన్నవారికి కూడా పూతలు, మరింతగా వస్తాయని వైద్యులు చెబుతున్నారు.
- జీర్ణ సమస్యలు, ముఖ్యంగా కొన్ని అంతర్గత వ్యాధులు ఉన్నవారిలో నోటి పూతలు తరచుగా వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.
- నోటి పూత తగ్గాలంటే గోరువెచ్చని ఉప్పునీటితో పుక్కిలించడం, కారం, పుల్లని, వేడి ఆహారాలకు దూరంగా ఉండటం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే తేనె రాయడం, మజ్జిగ లేదా కొబ్బరి నీళ్లు తాగడం మేలని చెబుతున్నారు. అంతేకాకుండా విటమిన్ బి, జింక్ వంటి పోషకాలున్న ఆహారం తినడం మంచిదని సూచిస్తున్నారు.

# పురుషుల కంటే స్త్రీలకు చలి ఎందుకు ఎక్కువగా అనిపిస్తుందో తెలుసా..?



శీతాకాలంలో చలిగా అనిపించడం సాధారణం. అయితే, ఒకే వాతావరణంలో ఉన్నప్పటికీ పురుషుల కంటే స్త్రీలకు చలి ఎక్కువగా అనిపిస్తుందని అంటారు. అయితే పురుషుల కంటే స్త్రీలకు చలి ఎందుకు ఎక్కువగా అనిపిస్తుంది? దీనికి కారణాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..

### జీవక్రియ..

మన శరీరంలో జీవక్రియ వేగంగా ఉంటే ఎక్కువగా వేడి ఉత్పత్తి అవుతుంది. అలాంటి వారికి చలి తక్కువగా అనిపిస్తుంది. జీవక్రియ నెమ్మదిగా ఉన్నవారికి శరీరంలో వేడి తక్కువగా ఉంటుంది. అందుకే వారికి చలి ఎక్కువగా అనిపిస్తుంది.

### రక్త ప్రసరణ కూడా కారణమే..

శరీరంలో రక్త ప్రసరణ సరిగ్గా లేకపోతే చేతులు, కాళ్లు ఎక్కువగా చల్లగా మారతాయి. రక్త ప్రసరణ మంచిగా ఉన్నవారికి మాత్రం చలి అంతగా అనిపించదు. శరీర ఆకారం, బరువు కూడా దీనిపై ప్రభావం చూపుతాయి. శరీరంలో కొవ్వు శాతం ఎక్కువగా ఉంటే చలి తక్కువగా అనిపిస్తుంది.

### స్త్రీలకు ఎందుకు ఎక్కువ చలి అనిపిస్తుంది?

పురుషులతో పోలిస్తే స్త్రీలలో హిమోగ్లోబిన్ స్థాయి తక్కువగా ఉంటుంది. అందుకే వారికి త్వరగా చలి అనిపిస్తుంది. అలాగే స్త్రీలలో కండరాల పరిమాణం తక్కువగా ఉండటం కూడా ఒక కారణం. కండరాలు ఎక్కువగా ఉంటే శరీరంలో వేడి ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది.

### వయస్సు, జీవనశైలి ప్రభావం..

వయస్సు పెరిగే కొద్దీ శరీర ఉష్ణోగ్రతను నియంత్రించే శక్తి తగ్గుతుంది. అందుకే వృద్ధులకు చలి ఎక్కువగా అనిపిస్తుంది. అలాగే తక్కువ నీరు తాగడం, ఎక్కువగా కాఫీ లేదా టీ తాగడం వంటి అలవాట్లు కూడా శరీర ఉష్ణోగ్రతపై ప్రభావం చూపుతాయి.

# మొబైల్ నెక్ సిండ్రోమ్ అంటే ఏంటో తెలుసా?

ఈ రోజుల్లో పిల్లలు, యువత ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లు, ట్యాబ్లు, ల్యాప్‌టాప్‌లతోనే గడుపుతున్నారు. ఆన్‌లైన్ క్లాసులు, గేమ్స్, సోషల్ మీడియా వల్ల గంటల తరబడి స్క్రీన్‌లను చూడటం సాధారణమైపోయింది. కానీ ఇలా సరైన భంగిమ లేకుండా మొబైల్‌ను ఉపయోగించడం వల్ల 'మొబైల్ నెక్ సిండ్రోమ్' అనే కొత్త ఆరోగ్య సమస్య తలెత్తుతోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

కొన్నేళ్ల క్రితం వరకు ఆరుబయట నడుస్తూ ఒకరినొకరు చూసుకుని మాట్లాడుకునేవారు. కానీ ఇప్పుడు ఎక్కడ చూసినా అందరూ తల వంచుకుని మొబైల్ స్క్రీన్‌లనే చూస్తున్నారు. ఈ అలవాటు మనకు తెలియకుండానే మెడ, వెన్నెముకపై తీవ్ర ఒత్తిడిని పెంచుతోంది.



### మొబైల్ నెక్ సిండ్రోమ్ అంటే ఏమిటి?

సాధారణంగా మన తల బరువు సుమారు 4.5 నుంచి 5 కిలోలు ఉంటుంది. తల నిటారుగా ఉన్నప్పుడు ఈ బరువును మెడ సులభంగా తట్టుకుంటుంది. కానీ మొబైల్ చూడటానికి తలను ముందుకు వంచితే, మెడపై పడే ఒత్తిడి చాలా రెట్లు పెరుగుతుంది. కేవలం 15 డిగ్రీలు తలను వంచినా మెడపై ఒత్తిడి అధికమవుతుందని వైద్యులు చెబుతున్నారు.

### మొబైల్ నెక్ సిండ్రోమ్ ఎందుకు వస్తుంది?

- టెక్నాలజీ కారణంగా కాదు, మనం దాన్ని ఉపయోగించే తీరే ఈ సమస్యకు కారణమని నిపుణులు అంటున్నారు.
- తప్పు భంగిమ: మొబైల్‌ను ఛాతీ లేదా కడుపు వద్ద పట్టుకుని చూడటం వల్ల మెడ వంగిపోతుంది.
- యువతపై ప్రభావం: టీనేజర్లు ఆన్‌లైన్ క్లాసులు, గేమ్స్, సోషల్ మీడియా కోసం గంటల తరబడి స్క్రీన్‌లను చూస్తారు. ఇది వారి ఎముకలు, కండరాల పెరుగుదలపై ప్రభావం చూపుతుంది.
- కదలికలు లేకపోవడం: ఎక్కువసేపు కూర్చోవడం, వ్యాయామం చేయకపోవడం వల్ల ఈ సమస్య మరింత పెరుగుతుంది.
- ప్రారంభంలో ఇది సాధారణ మెడ నొప్పిలా అనిపించవచ్చు. కానీ దీర్ఘకాలంలో తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది.
- మెడ, భుజాల్లో నొప్పి
- తలనొప్పి, చేతుల్లో తిమ్మిరి
- పై వీపు నొప్పి
- వెన్నెముక డిస్క్‌లకు సమస్యలు
- ఇప్పటివరకు వృద్ధులకు మాత్రమే వచ్చే మెడ సమస్యలు ఇప్పుడు 15--20 ఏళ్ల యువతలో కూడా కనిపిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు.
- ఈ లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి..
- మెడ నొప్పి 2--3 వారాలకుపైగా ఉండటం
- చేతుల్లో తిమ్మిరి లేదా సూదులు గుచ్చినట్టు అనిపించడం
- నడకలో లేదా సమతుల్యతలో ఇబ్బంది

### ఎలా నివారించాలి?

- ఫోన్ చూడడానికి తల వంచకుండా, కళ్ల ఎదురుగా పెట్టుకొని చూడండి.
- ప్రతి 20 నిమిషాలకు విరామం తీసుకోవాలి (20-20-20 నియమం)
- మెడ, వీపు వ్యాయామాలు చేయాలి
- పడుకునే ముందు మొబైల్ వాడకాన్ని తగ్గించాలని నిపుణులు చెబుతున్నారు

# అండర్-19 క్రికెట్‌లో తుఫాన్ ఇన్నింగ్స్

గత కొన్ని నెలలుగా అండర్-19 క్రికెట్‌లో కొన్ని తుఫాన్ ఇన్నింగ్స్‌లు కనిపించాయి. మొదట, వైభవ్ సూర్యవంశీ అండర్-19 వన్డేలో అత్యంత వేగవంతమైన సెంచరీ రికార్డును బద్దలు కొట్టాడు. ఆ తర్వాత, సూర్యవంశీ వేగవంతమైన సెంచరీ రికార్డును పాకిస్తాన్‌కు చెందిన సమీర్ మిన్హాస్ బద్దలు కొట్టాడు. ఇప్పుడు, ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ విల్ మలాజ్‌జుక్ అండర్-19 ప్రపంచ కప్ చరిత్రలో అత్యంత వేగవంతమైన సెంచరీ సాధించాడు. 18 ఏళ్ల ఆస్ట్రేలియన్ ఓపెనర్ జపాన్‌పై అత్యంత వేగవంతమైన సెంచరీ సాధించాడు. అండర్-19 ప్రపంచ కప్‌లో పాకిస్తాన్ బ్యాట్స్‌మన్ నెలకొల్పిన రికార్డును బద్దలు కొట్టాడు. జనవరి 20, 2026న జరిగిన అండర్-19 ప్రపంచ కప్ మ్యాచ్‌లో జపాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియాకు చెందిన విల్ మలాచిక్ 55 బంతుల్లో 102 పరుగులు చేశాడు. ఇందులో 5 సిక్సర్లు, 12 ఫోర్లు ఉన్నాయి. ఈ సమయంలో, అతను 51 బంతుల్లో తన సెంచరీని పూర్తి చేశాడు. ఇది అండర్-19 ప్రపంచ కప్ చరిత్రలో అత్యంత వేగవంతమైన సెంచరీగా కొత్త రికార్డుగా మారింది. గతంలో, ఈ రికార్డు పాకిస్తాన్‌కు చెందిన ఖాసిం అక్రమ్ పేరు మీద ఉంది. అతను 2022 అండర్-19 ప్రపంచ కప్‌లో శ్రీలంకపై చేశాడు. అప్పుడు ఖాసిం అక్రమ్ 63 బంతుల్లో సెంచరీ చేశాడు. అయితే, ఆస్ట్రేలియా ఓపెనర్ విల్ మలాచిక్ 12 బంతులు తక్కువ ఆడి ఖాసిం అక్రమ్ రికార్డును బద్దలు కొట్టాడు. 51 బంతుల్లో సెంచరీతో, విల్ మాలెచిక్ అండర్-19 ప్రపంచ కప్‌లో అత్యంత వేగంగా సెంచరీ చేసిన బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. అండర్-19 వన్డే చరిత్రలో అలా చేసిన రెండవ బ్యాట్స్‌మన్ కూడా అతను. అండర్-19 వన్డేల్లో అత్యంత వేగంగా సెంచరీ చేసిన ప్రపంచ రికార్డు పాకిస్తాన్ ఓపెనర్ సమీర్ మిన్హాస్ పేరిట ఉంది. అతను 41 బంతుల్లో ఈ సెంచరీ చేశాడు.



భారతదేశానికి చెందిన వైభవ్ సూర్యవంశీ అండర్-19 వన్డేల్లో అత్యంత వేగంగా సెంచరీ చేసిన మూడవ బ్యాట్స్‌మన్. అతను 52 బంతుల్లో తన సెంచరీని పూర్తి చేసుకున్నాడు. విల్ మలాచిక్ సెంచరీతో ఆస్ట్రేలియా 125 బంతులు మిగిలి ఉండగానే 8 వికెట్ల తేడాతో జపాన్‌ను ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన జపాన్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 201 పరుగులు చేసింది. దీనికి సమాధానంగా, ఆస్ట్రేలియా 29.2 ఓవర్లలో 2 వికెట్లకు 202 పరుగుల లక్ష్యాన్ని చేరుకుంది. అండర్-19 ప్రపంచ కప్ చరిత్రలో అత్యంత వేగవంతమైన సెంచరీని 51 బంతుల్లో నమోదు చేసినందుకు విల్ మలాచిక్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.




# టీమిండియా భారీ విజయం

### తొలి టీ20లో న్యూజిలాండ్‌పై 48 పరుగులే తేడాతో భారత్ ఘన విజయం

### తొలుత 7 వికెట్లకు 238 పరుగుల భారీ స్కోరు చేసిన టీమిండియా

### ఛేజింగ్ లో 7 వికెట్లకు 190 పరుగులే చేసిన కివీస్

నాగ్‌పూర్‌లోని విదర్భ క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో భారత జట్టు 48 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించింది. 239 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ చివరికి 20 ఓవర్లలో 7 వికెట్లకు 190 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. ఈ విజయంతో 5 మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా 1-0 ఆధిక్యంలో నిలిచింది.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ సాంట్నర్ బౌలింగ్ ఎంచుకున్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియాకు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. సంజూ శాంసన్ (10), ఇషాన్ కిషన్ (8) స్వల్ప స్కోర్లకే ఔటయ్యారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన అభిషేక్ శర్మ, కేవలం 35 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సర్లతో 84 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (32) అతనికి చక్కటి సహకారం అందించాడు. చివర్లో రింకూ సింగ్ 20 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 44 పరుగులు చేసి నాటౌట్‌గా నిలవడంతో భారత జట్టు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 238 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది.

భారీ లక్ష్యఛేదనలో కివీస్ కు ఆదిలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. ఓపెనర్ డెవాన్ కాన్వే (0), రచిన్ రవీంద్ర (1) తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. అయితే, గ్లెన్ ఫిలిప్స్ 40 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 78 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేశాడు. అతనికి మార్క్ చాప్‌మన్ (39) జత కలిసినప్పటికీ, భారీ లక్ష్యం ముందు వారి పోరాటం సరిపోలేదు. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో కివీస్ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 190 పరుగులకే పరిమితమైంది.

భారత బౌలర్లలో శివమ్ దూబే, వరుణ్ చక్రవర్తి చెరో రెండు వికెట్లు పడగొట్టగా, అర్ష్‌దీప్ సింగ్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ తలో వికెట్ తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.



# చరిత్ర సృష్టించిన అభిషేక్ శర్మ!

టీమిండియా స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ చరిత్ర సృష్టించాడు. అంతర్జాతీయ టీ20ల్లో 25 బంతుల్లోపే అత్యధిక హాఫ్ సెంచరీలు నమోదు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. అంతేకాకుండా ఈ పొట్టి ఫార్మాట్‌లో అత్యంత వేగంగా 5వేల పరుగులు చేసిన బ్యాటర్‌గా రికార్డ్ సాధించాడు. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా నాగ్‌పూర్ వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో 22 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించడం ద్వారా అభిషేక్ శర్మ ఈ ఫీట్ సాధించాడు. అంతర్జాతీయ టీ20ల్లో 25 బంతుల్లోపే హాఫ్ సెంచరీ సాధించడం అభిషేక్ శర్మకు ఇది 8వ సారి. ఈ క్రమంలో అతను ఇంగ్లండ్ బ్యాటర్ ఫిల్ సాల్ట్, భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వెస్టిండీస్ ప్లేయర్ ఎవిన్ లూయిస్‌లను అధిగమించాడు. ఈ ముగ్గురు బ్యాటర్లు 25 బంతుల్లోపు 7 హాఫ్ సెంచరీలు నమోదు చేశారు. న్యూజిలాండ్‌పై అత్యంత వేగంగా భారత బ్యాటర్ నమోదు చేసిన టీ20 హాఫ్ సెంచరీ కూడా ఇదే. ఈ క్రమంలో అతను కేఎల్ రాహుల్, రోహిత్ శర్మల రికార్డ్‌ను అభిషేక్ శర్మ అధిగమించాడు. ఈ ఇద్దరూ 23 బంతుల్లో న్యూజిలాండ్‌పై హాఫ్ సెంచరీ సాధించగా.. అభిషేక్ శర్మ 22 బంతుల్లో హాఫ్ సెంచరీ బాది ఈ రికార్డ్‌ను బ్రేక్ చేశాడు. ఈ మ్యాచ్‌లో విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగిన అభిషేక్ శర్మ తృటిలో సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. 35 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్స్‌తో 84 పరుగులు చేసి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. అతని విధ్వంసంతో ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 238 పరుగుల భారీ స్కోర్ చేసింది.

# ప్రపంచకప్ గెలవాలంటే రోహిత్ శర్మనే కెప్టెన్‌గా ఉండాలి

## మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ సూచన



ఐసీసీ వన్డే ప్రపంచకప్ 2027లో టీమిండియా విజేతగా నిలవాలంటే రోహిత్ శర్మనే కెప్టెన్‌గా కొనసాగించాలని మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ అన్నాడు. అసలు కెప్టెన్సీ బాధ్యతల నుంచి రోహిత్ శర్మను తప్పించాల్సిన అవసరం ఏం ఉందని ప్రశ్నించాడు. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో 2-1తో టీమిండియా ఓటమిపాలైన సంగతి తెలిసిందే. 38 ఏళ్ల తర్వాత భారత గడ్డపై న్యూజిలాండ్ వన్డే సిరీస్ గెలిచింది. దాంతో టీమ్‌మేనేజ్‌మెంట్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ పరాజయం నేపథ్యంలో ఓ స్పోర్ట్స్ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మనోజ్ తివారీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'కెప్టెన్సీ బాధ్యతల నుంచి రోహిత్ శర్మను తప్పించాల్సిన అవసరం ఏం ఉంది? ఇప్పటికీ రోహిత్ శర్మ కెప్టెన్‌గా కొనసాగి ఉంటే న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో ఫలితం మరోలా ఉండేది. ఎందుకంటే రోహిత్ శర్మ సారథ్యంలో భారత్ ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచినప్పుడు జట్టు సరైన దిశలో నడుస్తుందని నేను భావించాను. ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు. రోహిత్ శర్మకు తిరిగి కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించాలి. వన్డే ప్రపంచకప్ సమీపిస్తున్న తరుణంలో బీసీసీఐ తన తప్పును తెలుసుకొని సరిదిద్దుకోవాలి. ఇది ప్రపంచకప్‌కు సంబంధించిన విషయం. ఏదో ఒక ద్వైపాక్షిక సిరీస్ లేదా సాధారణ టోర్నీ గురించి మనం మాట్లాడటం లేదు. దేశం గర్వించే మెగా టోర్నీ కోసం అనుభవం కలిగిన సారథి అవసరం. రోహిత్ శర్మకు అపారమైన అనుభవం ఉంది. అంతర్జాతీయ క్రికెట్‌లో శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్‌గా అనుభవం లేదు. రోహిత్ అతని కంటే చాలా ముందున్నాడు. అనుభవం కలిగిన కెప్టెనా? కాదా? అనేది వారి ఫీల్డ్ సెటప్, బౌలింగ్ మార్పులు, ఏ బౌలర్‌తో ఏ ఎండ్ నుంచి బౌలింగ్ చేయిస్తున్నారు? అనే విషయాలతో తెలిసిపోతుంది. హిత్ శర్మ.. శుభ్‌మన్ గిల్ కంటే ఎంతో గొప్ప సారథి. అందుకే హిట్ మ్యాన్ సక్సెస్‌ఫుల్ కెప్టెన్‌గా నిలిచాడు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో కూడా భారత్ ప్రపంచకప్ గెలవవచ్చు. కానీ రోహిత్‌తో పోల్చినప్పుడు అతను అనుభవం లేని కెప్టెన్‌గా కనిపిస్తున్నాడు. గిల్ కెప్టెన్సీలో కంటే రోహిత్ సారథ్యంలో టీమిండియా గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.' అని మనోజ్ తివారి చెప్పుకొచ్చాడు.

# టీ20 ప్రపంచ కప్ 15 జట్ల స్క్వాడ్స్ విడుదల




టీ20 ప్రపంచ కప్ కోసం 15 జట్లను ప్రకటించారు. అంతకుముందు, 15 మంది సభ్యులతో కూడిన టీం ఇండియా జట్టును ప్రకటించారు. దీని తర్వాత, ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు మరియు ఆస్ట్రేలియన్ క్రికెట్ బోర్డు టీ20 ప్రపంచ కప్ కోసం తాత్కాలిక జట్లను ప్రకటించాయి. ఇప్పుడు దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ మరియు ఆఫ్ఘనిస్తాన్ కూడా తమ టీ20 ప్రపంచ కప్ జట్లను ప్రకటించాయి. దీని ప్రకారం, రాబోయే టీ20 ప్రపంచ కప్‌లో పాల్గొనే 15 జట్లు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

**జింబాబ్వే:** సికందర్ రజా (కెప్టెన్), బ్రియాన్ బెన్నెట్, ర్యాన్ బర్లే, గ్రేమ్ క్రీమర్, బ్రాడ్లీ ఎవాన్స్, క్లైవ్ మదాండే, టినోటెండా మపోసా, తడివానాషే మారుమణి, వెల్లింగ్‌టన్ మసకద్జా, టోనీ మునియోంగా, తషింగా ముసెకివా, బ్లెస్సింగ్ ముజారబానీ, రిచెర్డ్ నైగ్రావానీ, బ్లెస్సింగ్ ముజారబానీ,

**ఇంగ్లాండ్ టీ20 జట్టు (తాత్కాలిక):** హ్యారీ బ్రూక్ (కెప్టెన్), రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, టామ్ బాంటన్, జాకబ్ బెథెల్, జోస్ బట్లర్, సామ్ కుర్రాన్, లియామ్ డాసన్, బెన్ డకెట్, విల్ జాక్స్, జామీ ఓవర్టన్, ఆదిల్ రషీద్, ఫిల్ సాల్ట్, జోష్ టోంగ్, ల్యూక్ వుడ్.

**ఆస్ట్రేలియా టీ20 జట్టు (తాత్కాలిక):** మిచెల్ మార్ష్ (కెప్టెన్), జేవియర్ బార్ట్‌లెట్, కూపర్ కొన్నోలీ, పాట్ కమ్మిన్స్, టిమ్ డేవిడ్, కామెరాన్ గ్రీన్, నాథన్ ఎల్లిస్, జోష్ హాజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కుహ్నెమాన్, గ్లెన్ మాక్స్‌వెల్, మాథ్యూ షార్ట్, మార్కస్ స్టోయినిస్, ఆడమ్ జంపా.

**ఒమన్ టీ20 జట్టు:** జతీందర్ సింగ్ (కెప్టెన్), వినాయక్ శుక్లా, మహ్మద్ నదీమ్, షకీల్ అహ్మద్, హమ్మద్ మీర్జా, వసీం అలీ, కరణ్ సోనోవాల్, షా ఫైసల్, నదీమ్ ఖాన్, సుఫ్యాన్ మెహమూద్, జై ఒడెదర, షఫీక్ జాన్, ఆశిష్ రమానంది, హసీన్ ఒడెదర, జితీన్.

**దక్షిణాఫ్రికా టీ20 జట్టు:** ఐడెన్ మార్క్రామ్ (కెప్టెన్), క్వింటన్ డి కాక్, టోనీ డి జోర్జి, డెవాల్డ్ బ్రీవిస్, డేవిడ్ మిల్లర్, డొనోవన్ ఫెరీరా, మార్కో జాన్సెన్, కేశవ్ మహరాజ్, కగిసో రబడ, క్వేనా మఫాకా, లుంగి ఎన్‌గిడి, జాసన్ స్మిత్, కార్బిన్, జార్జి లిన్నియా, జార్జి లిన్నియా.

**నెదర్లాండ్స్ టీ20 జట్టు:** స్కాట్ ఎడ్వర్డ్స్ (కెప్టెన్), కోలిన్ అకెర్మాన్, నోహ్ క్రూస్, బాస్ డి లీడే, ఆర్యన్ దత్, ఫ్రెడ్ క్లాసెన్, కైల్ క్లైన్, మైఖేల్ లెవిట్, జాక్ లియోన్-కాచెట్, మాక్స్ ఓ'డౌడ్, లోగాన్ వాన్ బీక్, టిమ్ వాన్ మ్వెలోఫ్, టిమ్ వాన్ మ్వెలోఫ్ మీకెరెన్, సాకిబ్ జుల్ఫికర్.

**ఆఫ్ఘనిస్థాన్ టీ20 జట్టు:** రషీద్ ఖాన్ (కెప్టెన్), నూర్ అహ్మద్, అబ్దుల్లా అహ్మద్‌జాయ్, సైదిఖుల్లా అటల్, ఫజల్‌హాక్ ఫరూకీ, రహ్మనుల్లా గుర్బాజ్, నవీన్ ఉల్ హక్, మహ్మద్ ఇషాక్, షాహిదుల్లా కమల్, మహ్మద్ నబీ, అజ్మతుల్లా నబీ, అజ్మతుల్లా నబీ, అజ్మతుల్లా నబీజే దర్విష్ రసూలీ, ఇబ్రహీం జద్రాన్.

**నమీబియా జట్టు:** గెర్హార్డ్ ఎరాస్మస్ (కెప్టెన్), జేన్ గ్రీన్, బెర్నార్డ్ స్కోల్ట్జ్, రూబెన్ ట్రంపెల్మాన్, జేజే స్మిత్, జాన్ ఫ్రీలింక్, లౌరెన్ స్టీన్‌క్యాంప్, మలన్ క్రుగర్, నికోల్ లాఫ్టీ-ఈటన్, జాక్ బ్రాసెల్, బెన్ షికోంగో, జేజ బాల్ట్, డిలాన్ లీచర్, ఫ్రై హీంగెబర్గ్, మాక్స్ హింగో.

**న్యూజిలాండ్ టీ20 జట్టు:** మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), ఫిన్ అలెన్, మైఖేల్ బ్రేస్‌వెల్, మార్క్ చాప్‌మన్, డెవాన్ కాన్వే, జాకబ్ డఫీ, లాకీ ఫెర్గూసన్, మాట్ హెన్రీ, డారిల్ మిచెల్, ఆడమ్ మిల్నే, జేమ్స్ నీషమ్, గ్లెన్ ఫిలిప్స్, రాచిన్ రవీంద్ర, టిమ్ సీఫెర్ట్, ఇష్ సోధి.

**ఐర్లాండ్ టీ20 జట్టు:** పాల్ స్టిర్లింగ్ (కెప్టెన్), మార్క్ అడైర్, రాస్ అడైర్, బెన్ కాలిట్జ్, కర్టిస్ కాంఫర్, గారెత్ డెలానీ, జార్జ్ డాక్రెల్, మాథ్యూ హంఫ్రీస్, జోష్ లిటిల్, బారీ మెక్[illegible]కార్తీ, హ్యారీ టెక్టర్, టిమ్ టెక్టర్, లోర్కాన్ టక్కర్, బెన్ వైట్, క్రెయిగ్ యంగ్

**బంగ్లాదేశ్:** లిటన్ దాస్ (కెప్టెన్), తాంజిద్ హసన్, పర్వేజ్ హొస్సేన్ ఎమాన్, సైఫ్ హసన్, తౌహిద్ హృదయ్, షమీమ్ హొస్సేన్, క్వాజీ నూరుల్ హసన్ సోహన్, షక్ మహేదీ హసన్, రిషాద్ హొస్సేన్, నసుమ్ అహ్మద్, ముస్తాఫిజుర్ రహమాన్, తన్‌జీమ్ ఎ హసన్, తన్‌జీమ్ ఎ హసన్.

**ఇటలీ టీ20 జట్టు:** వేన్ మాడ్సెన్ (కెప్టెన్), మార్కస్ కాంపోపియానో, జియాన్ పియరో మీడే, జైన్ అలీ, అలీ హసన్, క్రిషన్ జార్జ్, హ్యారీ మానెంటి, ఆంథోనీ మోస్కా, జస్టిన్ మోస్కా, సయ్యద్ నఖ్వీ, బెంజమిన్ మనేంటి, జస్‌ప్రీత్ సింగ్, గ్రాంట్ స్మత్స్, గ్రాంట్ స్మత్స్.

**నేపాల్ టీ20 జట్టు:** రోహిత్ పౌడెల్ (కెప్టెన్), దీపేంద్ర సింగ్ ఎయిరి, సందీప్ లామిచానే, కుశాల్ భుర్టెల్, ఆసిఫ్ షేక్, సందీప్ జోరా, ఆరిఫ్ షేక్, బసీర్ అహ్మద్, సోంపాల్ కమీ, కరణ్ కెసి, నందన్ యాదవ్, గుల్షన్ ఝా, బి షేర్ రాజభమ్సి, లోకేశ్ రాజభంసీ, లోకేశ్

**కెనడా టీ20 జట్టు:** దిల్‌ప్రీత్ బజ్వా (కెప్టెన్), అజయ్‌వీర్ హుండాల్, అన్ష్ పటేల్, ధిల్లాన్ హెలిగర్, హర్ష్ ఠాక్రే, జస్కరన్‌దీప్ భట్టర్, కలీమ్ సనా, కన్వర్‌పాల్ తత్గూర్, నవనీత్ ధలీవాల్, నికోలస్ కిర్టన్, రవీందర్‌పాల్ సింగ్, సాద్ బిన్ యూ జాఫ్రే, శివంబ్రా శర్మ, మోబ్రా షర్యస్ యువరాజ్ సమ్రా.

**భారత టీ20 జట్టు:** సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), జస్‌ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా, వాషింగ్టన్, రింకూ సింగ్.

# అనుకున్న టైమ్‌కే వారణాసి విడుదల

సూపర్‌స్టార్ మహేశ్ బాబు ,దర్శకధీరుడు రాజమౌళి కలయికలో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'వారణాసి'పై ఇప్పటికే దేశవ్యాప్తంగా అంచనాలు భారీగా ఏర్పడ్డాయి. రెండు నెలల క్రితం హైదరాబాద్‌లో నిర్వహించిన గ్రాండ్ ఈవెంట్‌లో ఈ సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించడంతో పాటు, విడుదల సంవత్సరాన్ని కూడా మేకర్స్ వెల్లడించారు. అయితే రాజమౌళి సినిమాలు అనుకున్న షెడ్యూల్‌కు కచ్చితంగా పూర్తవుతాయా అనే సందేహం ప్రేక్షకుల్లో కొత్తది కాదు. గత చిత్రాల అనుభవం నేపథ్యంలో, 'వారణాసి' నిజంగా 2027లో విడుదల అవుతుందా? అనే ప్రశ్నలు సోషల్ మీడియాలో గట్టిగానే వినిపించాయి. ఈ నేపథ్యంలో తాజాగా చిత్రబృందం మరోసారి స్పందించి, సినిమా 2027లోనే ప్రేక్షకుల ముందుకు వస్తుందని స్పష్టత ఇచ్చింది. ఈ ప్రకటనతో కొంతమంది అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తుండగా, మరికొందరు మాత్రం ఇంకా సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఉగాది లేదా శ్రీరామనవమి లాంటి పండుగ సీజన్‌లో సినిమా విడుదలయ్యే అవకాశముందని ఫ్యాన్స్ అంచనా వేస్తున్నారు. అయితే, ఇంకా ఏడాది మాత్రమే మిగిలి ఉండటంతో అంత భారీ ప్రాజెక్ట్‌ను ఆలోపు పూర్తి చేయగలరా అనే చర్చ కూడా జోరుగా సాగుతోంది. ఈ చిత్రంలో మహేశ్ బాబు సరసన గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇది మహేశ్ కెరీర్‌లోనే కాకుండా, ప్రియాంకకు కూడా ఒక ప్రత్యేకమైన ఇండియన్ ప్రాజెక్ట్‌గా మారనుంది. విలన్ పాత్రలో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కనిపించనుండటం మరో హైలైట్. అంతేకాదు, సినిమాలో ఒక కీలక ఘట్టంలో మహేశ్ బాబు రాముడి పాత్రలో కనిపిస్తారని రాజమౌళి ఇప్పటికే వెల్లడించడంతో ఈ అంశంపై కూడా భారీ ఆసక్తి నెలకొంది. 'వారణాసి'ని టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో, భారతీయ పురాణాలు, ఆధునిక సైన్స్‌ను మేళవిస్తూ రూపొందిస్తున్నారని సమాచారం. భారీ బ్జడెట్, అంతర్జాతీయ స్థాయి టెక్నికల్ టీమ్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే అభిమానులు 'రిలీజ్ ఆలస్యమైనా పర్వాలేదు, కానీ ఇది లైఫ్‌టైమ్ ఎక్స్‌పీరియన్స్ మూవీ కావాలి' అంటూ సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి, మేకర్స్ 2027 డేట్‌కు కట్టుబడి ఉన్నామని మ-రోసారి స్పష్టం చేసినప్పటికీ, ఈ సినిమా చుట్టూ ఉన్న క్యూరియాసిటీ మాత్రం రోజు రోజుకీ పెరుగుతూనే ఉంది. 'వారణాసి' ఎప్పుడు వచ్చినా, అది భారతీయ సినిమాకు మరో మైలురాయిగా నిలుస్తుందనే నమ్మకం అభిమానుల్లో బలంగా ఉంది.



# పవన్ ఉస్తాద్ కోసం చంద్రబోస్ పట్టు

## మేనరిజానికి తగ్గట్లుగా బ్యాక్ గ్రౌండ్ సాంగ్



పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. హరీష్ శంకర్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో శ్రీలీల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. రాశీఖన్నా కీలక పాత్ర పోషిస్తోంఇ. టాలీవుడ్ టాప్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన ఫస్ట్ సింగిల్ దేఖ్ లేంగే సాలా నెట్టింటిని షేక్ చేస్తుందని తెలిసిందే. తాజాగా మరో క్రేజీ అప్‌డేట్ అందించారు మేకర్స్. ప్రముఖ లిరిసిస్ట్ చంద్రబోస్ రాసిన బ్యాక్ గ్రౌండ్ సాంగ్ రెడీ అయింది. ఆస్కార్ అవార్డు విన్నర్ చంద్రబోస్ సెన్సేషనల్ లిరిక్స్‌తో పవన్ స్టార్ మేనరిజాన్ని మరోసారి చూపించబోతుంది. వేచి ఉండండి.. అంటూ చంద్రబోస్ రిలిక్స్ సిద్ధం చేస్తున్న స్టిల్‌ను షేర్ చేశారు. ఇప్పుడీ స్టిల్ నెట్టింట వైరల్ అవుతూ మరో బ్లాక్ బస్టర్ సాంగ్ రెడీ అవుతుందని చెప్పకనే చెబుతోంది. దేవీ శ్రీ ప్రసాద్ కంపోజిషన్‌లో విశాల్ దడ్‌లానీ పాడిన రంపంపం రంపంపం స్టెప్పేస్తే భూకంపం.. దేఖ్‌లేంగే సాలా సాంగ్ అంటూ లాంగ్ గ్యాప్ తర్వాత పవన్ కల్యాణ్‌లోని స్టైలిష్ డ్యాన్స్‌ను మరోసారి సిల్వర్ స్క్రీన్‌పై చూపించబోతున్నట్టు విజువల్స్ క్లారిటీ ఇచ్చేశారు. ఇక భగత్.. భగత్ సింగ్ మహంకాళి పోలీస్‌స్టేషన్, పత్తర్ గంజ్, ఓల్డ్ సిటీ. ఈ సారి పర్ఫార్మన్స్ బద్దలైపోద్ది.. అంటూ ఉస్తాద్ భగత్ సింగ్ గ్లింప్స్‌లో పవన్ కల్యాణ్ తనదైన స్టైల్‌లో డైలాగ్స్ చెబుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాడు. గబ్బర్ సింగ్ లాంటి బ్లాక్ బస్టర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని మార్చి చివరి వారంలో లేదా ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ఎ÷-లాన్ చేస్తుండగా.. మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.



# షాహిద్, తృప్తి దిమ్రిల ఓ రోమియో



బాలీవుడ్ వెండితెరపై మరో క్రేజీ కాంబినేషన్ సందడి చేయబోతోంది. స్టార్ హీరో షాహిద్ కపూర్, సెన్సేషనల్ బ్యూటీ తృప్తి దిమ్రి జంటగా నటిస్తున్న భారీ యాక్షన్ రొమాంటిక్ డ్రామా 'ఓ రోమియో'. ఈ చిత్రం వాలెంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 13న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. గతంలో 'కమినే', 'హైదర్', 'రంగూన్' వంటి క్లాసిక్ చిత్రాలను అందించిన టాలెంటెడ్ డైరెక్టర్ విశాల్ భరద్వాజ్ నాలుగోసారి షాహిద్ కపూర్‌తో జతకడుతుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ నిర్మాత సాజిద్ నడియాద్వాలా ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. సినిమా విడుదల తేదీ దగ్గరపడటంతో మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. తాజాగా విడుదలైన ఈ సినిమా ట్రైలర్ సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ముంబై అండర్ వరల్డ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే పవర్‌ఫుల్ క్రైమ్ అండ్ లవ్ స్టోరీగా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ముఖ్యంగా షాహిద్ కపూర్ మునుపెన్నడూ లేని విధంగా అత్యంత భయంకరమైన 'వైల్డ్' లుక్‌లో కనిపిస్తూ షాక్ ఇచ్చారు. ఒళ్లంతా టాటూలు, రక్తపు మరకలతో ఉన్న ఆయన లుక్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ చిత్రంలో తృప్తి దిమ్రితో పాటు నానా పటేకర్, అవినాష్ తివారీ, విక్రాంత్ మస్సే, దిశా పటానీ వంటి హేమాహేమీలు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా ఒక ప్రత్యేక పాత్రలో మెరవనుండటం సినిమాకు మరో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది

# డెకాయిట్‌లో ముగిసిన మృణాల్ యాత్ర



టాలీవుడ్‌లో కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకున్న అడివి శేష్ ప్రస్తుతం తన కెరీర్‌లో మరో కీలక దశలో ఉన్నాడు. వరుసగా విభిన్న కథలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వస్తున్న శేష్, ఇప్పుడు భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న తన తాజా చిత్రం 'డెకాయిట్' తో మరోసారి బజ్ క్రియేట్ చేస్తున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ అభిమానుల్లో మరింత ఆసక్తిని రేపుతోంది. ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న మృణాల్ ఠాకూర్ తనకు సంబంధించిన షూటింగ్‌ను పూర్తిగా ముగించుకుంది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటిస్తూ, సెట్స్‌లో తీసిన కొన్ని ప్రత్యేక ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. టీమ్ మొత్తం కలిసి ఉన్న ఈ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ కాంబినేషన్ ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి క్యూరియాసిటీని క్రియేట్ చేసింది. ఇద్దరూ నటనలో మంచి అనుభవం ఉన్నవాళ్లే కావడంతో, ఈ సినిమాలో భావోద్వేగ సన్నివేశాలు బలంగా ఉండబోతున్నాయనే టాక్ వినిపిస్తోంది. ఇటీవలే ఈ హై వోల్టేజ్ డ్రామాకు సంబంధించిన కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసినట్లు సమాచారం. మృణాల్ షూటింగ్ ముగియడంతో, ఇకపై సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు మరింత వేగంగా సాగనున్నాయి. 'సీతారామం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైన మృణాల్ ఠాకూర్, ఈ చిత్రంలో ఎలాంటి పాత్రలో కనిపించబోతుందన్నది ఆసక్తికరంగా మారింది. ఆమె పాత్ర కథలో కీలక మలుపులు తిప్పేలా ఉంటుందని చిత్ర వర్గాలు సూచిస్తున్నాయి. ఇదిలా ఉంటే, 'డెకాయిట్' రిలీజ్ డేట్‌పై కూడా మేకర్స్ స్పష్టత ఇచ్చారు. ఈ సినిమాను ఈ ఏడాది మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని నిర్ణయించారు. ఉగాది పండుగ సందర్భంగా థియేటర్లలోకి రానున్న ఈ చిత్రం, తెలుగు మరియు హిందీ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది. పండుగ సీజన్ కావడంతో బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్స్ సాధిస్తుందనే అంచనాలు ఉన్నాయి. అడివి శేష్ ఎప్పటిలాగే ఈసారి కూడా కొత్త తరహా కథను ఎంచుకున్నాడు. 'డెకాయిట్' ఒక రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన రావడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. శేష్ లుక్, ప్రెజెంటేషన్ అన్నీ కొత్తగా ఉండటంతో ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకంగా నిలుస్తోంది. ఈ చిత్రానికి షానీల్ డియో దర్శకత్వం వహిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. అనురాగ్ కశ్యప్, కమలక్ష్మి భాస్కర్ వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో నటించడం సినిమాకు అదనపు బలాన్ని ఇస్తోంది.

# పవన్ సార్..ప్రధాని స్థాయికి ఎదిగినా ఆశ్చర్యం లేదు

## నటి నిధి అగర్వాల్ సంచలన కామెంట్స్

తన సినిమాల విడుదల సమయాల్లోనే కాకుండా తరచూ ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ పలు ఆసక్తికర విషయాలను పంచుకుంటూ ఉంటారు నటి నిధి అగర్వాల్. తాజాగా ఆమె ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొని పవన్ కల్యాణ్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. పవన్ కల్యాణ్ ఎంతోమందికి దేవుడితో సమానం. ఆయనంటే అంత క్రేజ్ ఉంది. అలాంటి అభిమానం కొందరికి మాత్రమే సొంతం. ఆయన కూడా అభిమానులను అలానే చూసుకుంటారు. ఆయనతో కలిసి వర్క్ చేసేటప్పుడు నేను ప్రత్యక్షంగా చూశాను. కలిసిన అందరితో బాగా మాట్లాడతారు. 'హరిహర వీరమల్లు'కు వర్క్ చేసే సమయంలో చాలా మంది నా దగ్గరకు వచ్చి 'మీరు మా దేవుడితో వర్క్ చేస్తున్నారు' అని అనేవారు. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకోవచ్చు. ఎప్పుడూ పాజిటివ్‌గా ఉంటారు. వందశాతం కష్టపడతారు. ఎలాంటి విషయాన్నైనా ధైర్యంగా చెబుతారు. నిజాయతీగా ఉంటారు. సినిమాలతో సంబంధం లేకుండా ప్రజలు ఆయన్ని ఇష్టపడతారు. భవిష్యత్తులో ఆయన ప్రధాని అయినా ఆశ్చర్యపడను' అని నిధి అన్నారు.ఒకరిని ఉన్నతస్థానాలకు తీసుకెళ్లడానికి కాకుండా.. తొక్కేయడానికి భారీగా డబ్బులు ఖర్చు చేస్తున్నారు. నటీనటులకు కూడా ఎమోషన్స్ ఉంటాయి. నెగెటివ్ ప్రచారం వల్ల మానసికంగా కుంగిపోతారు. వాళ్లతో పాటు వాళ్ల కుటుంబాలు కూడా ఎంతో బాధను అనుభవిస్తాయని నిధి ఆవేదన వ్యక్తం చేశారు.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463